SHARP NEWS
తెలుగు జాతీయ
దినపత్రికలో ప్రకటనల
కోసం సంప్రదించండి
V.V. Sarma, Editor
- Mob No:
8466099201

శుక్రవారం, ఏప్రిల్ 18, 2025 వెల: 5 రూ/.
సంపుటి: 12 సంచిక: 130, పేజీలు - 08

# షార్ప్ న్యూస్

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : వూటుకూరు వేంకటేశ్వర శర్మ

విలేకరులు కావలెను
(Part Time/Full Time)

రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలకు విలేకరులు కావలెను

అర్హతలు : తెలుగులో రాయడం రావాలి.
సమాజం మీద అవగాహన ఉండాలి.

Send your Resumes to : Whats app No: 8985483063 (Don't call)
mail id :sharpnews2012@gmail.com

CIRCULATED FROM HYDERABAD, NALGONDA, KARIMNAGAR, WARANGAL, KHAMMAM, VIJAYAWADA, VISAKHAPATNAM, NELLORE



## 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

2లో..



జగన్ అక్రమాస్తుల్లో రూ.793

## కోట్ల ఆస్తుల జప్తు

2లో..



## చెంబుడు నీళ్ళు... గుప్పెడు మట్టి !

2లో..

# తొలి రోజే బిగ్ డీల్

## - జపాన్ పర్యటనలో సీఎం రేవంత్

- తెలంగాణలో మరో అంతర్జాతీయ సంస్థ పెట్టుబడి
- ఫ్యూచర్ సిటీలో జపాన్ కంపెనీ ఇండస్ట్రియల్ పార్క్
- ఫ్యూచర్ సిటీలో మారుబెనీ 1000 కోట్ల పెట్టుబడి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం జపాన్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా తొలి రోజునే భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. జపాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ మరుబెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది.**



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజే భారీ పెట్టుబడులను ఆకర్షించింది. జపాన్‌కు చెందిన దిగ్గజ సంస్థ మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసింది. టోక్యోలో మారుబెనీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ. 1000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశలవారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సీఎం రేవంత్ సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ

2లో..



# వక్ఫ్ ఆస్తుల్లో మార్పులు చేయొద్దు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ చట్టం 2025పై వివాదాలు చెలరేగుతున్న టైమ్ లో సుప్రీంకోర్టు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి మార్పులు, నియామకాలు చేయకుండా, ప్రస్తుతం ఉన్న స్థితిని (యధాతథ స్థితి) పాటించాలని ఆదేశించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన వివరణ ఇవ్వాల్సి ఉండటంతో, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వారం రోజుల గడువు కోరారు. ధర్మాసనం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణను మే 5కి వాయిదా వేసింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన 73 పిటిషన్లపై సుప్రీం కోర్టు ఇప్పటికే రెండు రోజులుగా వాదనలు వింటోంది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ఈ చట్టం మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వక్ఫ్ అంటే ఇస్లాం మతానికి అంకితమైన ఆస్తులని సిబాల్ అభిప్రాయపడ్డారు. ఇక కేంద్రం తరఫున వాదనలు వినిపించిన తుషార్ మెహతా, ఈ చట్టం ఏర్పాటుకు జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) ద్వారా అన్ని వర్గాలతో చర్చలు జరిపినట్టు చెప్పారు. వక్ఫ్ అనేది పూర్తిగా ధార్మిక దాతృత్వానికి సంబంధించిన వ్యవస్థ మాత్రమేనని, దేశంలో హిందూ ధార్మిక సంస్థలు కూడా ప్రభుత్వ నియంత్రణలో ఉండటాన్ని గుర్తు చేశారు. అంతేగాక, మసీదులు అనేకం వక్ఫ్ బై యూజర్ ద్వారా ఏర్పడ్డాయని, వాటిని రిజిస్టర్ చేసుకోవడంలో అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వక్ఫ్ ఆస్తులపై స్టేటస్ కో విధించింది. వక్ఫ్ బోర్డుల్లో కొత్త నియామకాలు

2లో..

## కేసీఆర్‌కు సిగ్గుందా ? భూములపై చర్చకు రెడీ

**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** హెచ్ సీయూ భూములు, గత బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూముల అమ్మకాలకు సంబంధించి కేటీఆర్ చర్చకు సిద్ధమేనా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. విలేకరుల ఆధ్వర్యంలో చర్చకు తాను రెడీగా ఉన్నట్టు చెప్పారు. ఆ భూముల గురించి మాట్లాడడానికి కేటీఆర్ కి సిగ్గుండాలి. సుప్రీంకోర్టు తీర్పును కేటీఆర్, హరీష్ రావు వక్రీకరిస్తున్నారని ఆరోపించారు మహేశ్ కుమార్ గౌడ్. కంచ గచ్చిబౌలి భూములను ప్రైవేట్ పరం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. కానీ ఈ భూముల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే 5 వేల

2లో..



## కొత్త పవర్ సెంటర్‌గా కవిత

**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** బీఆర్ఎస్ లో మరో పవర్ సెంటర్ తయారవుతోందా? ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో జైలుకు వెళ్ళొచ్చిన కవిత కొన్నాళ్ళు ఇంటికే పరిమితమయ్యారు. కానీ ఈమధ్యే మళ్ళీ రాజకీయాల్లో అగ్రెసివ్ గా దూసుకెళ్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. అంతవరకూ అయితే ఫర్వాలేదు. కానీ బీఆర్ఎస్ కి సంబంధించి కొన్ని కీలకమైన స్టేట్ మెంట్స్ ఇస్తుండటంతో పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్

2లో..



# తెలంగాణలో ఉద్యోగాల జాతర !

### 50 వేల పైగా పోస్టుల భర్తీకి రంగం సిద్ధం..!



**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** తెలంగాణలో నిరుద్యోగులకు శుభవార్త. ప్రభుత్వం ఉద్యోగాల జాతరకు రంగం సిద్ధం చేస్తోంది. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తవడంతో, టీజీపీఎస్సీ, గురుకుల, పోలీసు, వైద్య రంగాల్లో భారీగా ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఈ నెలాఖరులోపు ఉద్యోగ నోటిఫికేషన్ల ప్రక్రియ మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే 56,740 పైగా ఖాళీలు గుర్తించినట్టు సమాచారం. వీటిలో 14,236 అంగన్‌వాడీ, 10,954 రెవెన్యూ ఉద్యోగాలు ఖరారయ్యాయి. మిగిలిన పోస్టులు వివిధ శాఖలలో ఉన్నాయి. గ్రూప్ 1తో పాటు గ్రూప్ 2, 3, 4 పోస్టులకూ నోటిఫికేషన్లు రానున్నట్లు సమాచారం.

### ఈ నెల చివరి వారం నుంచి నోటిఫికేషన్లు

తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది (2024-25)కి ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు రావడంతో నోటిఫికేషన్లు వాయిదా వేశారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం పూర్తిచేయడం, ఆ రిజర్వేషన్లు ఈ నెల 14 నుంచి అమలులోకి వచ్చాయి.

2లో..

# గాంధీ కుటుంబానికి వేధింపులు

## - ఈడీ ఆఫీస్ ముందు కాంగ్రెస్ ధర్నా

**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** దేశంలో ప్రధాని మోడీ హవా తగ్గుతుండటంతో సోనియా, రాహుల్ పై కేసులు పెడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేతలపై ఈడీ కక్ష సాధిస్తోందని ఆరోపిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించింది. హైదరాబాద్ లో ఈడీ ఆఫీసు ముందు మంత్రులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున ధర్నాకు దిగారు. దేశంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ పెరుగుతోంది. సోనియా, రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. అందుకే బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం తేవడంతో పాటు, సమైక్యతను కాపాడటంలో కాంగ్రెస్ చేసిన త్యాగాలు తెలిసిన ప్రతి భారత పౌరుడు గాంధీ కుటుంబానికి అండగా ఉంటున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ 10 యేళ్ళుగా దేశాన్ని అదానీ, అంబానీకి అప్పగిస్తుంటే వ్యతిరేకించినందునే రాహుల్ గాంధీపై కక్ష సాధిస్తున్నారని మంత్రి పొన్నం ఆరోపించారు. మా నేతలు విచారణకు హాజరవుతున్నారు, కానీ మీ వేధింపులు దేశ ప్రజలకు చెప్పడానికే ధర్నాలు చేస్తున్నామన్నారు మంత్రులు.




నేషనల్ హెరాల్డ్ పేపరుకి రూ.90 కోట్లు రుణం ఇస్తే మనీలాండరింగ్ జరిగినట్లు ఎలా అవుతుందని పీసీపీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ ధర్నాలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బలమూరి వెంకట్, ఎమ్మెల్యేలు శంకరయ్య, రాజ్ ఠాగూర్ కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీసు ఎదుట పీసీసీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

2లో..

## రేవంత్ ని కాపాడేది మోడీయే : కేటీఆర్



**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వేలల్లో చెట్లను నరికి, జంతువులకు నిలువ నీడ లేకుండా చేశారు. ఈ వ్యవహారంలో భారీ ఆర్థిక మోసం జరిగిందని సెంట్రల్ ఎంపవర్ కమిటీ నివేదిక ఇచ్చింది. అయినా సీఎం రేవంత్ రెడ్డిని ప్రధాని మోడీ ఎందుకు కాపాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఇంత స్పష్టమైన నివేదిక వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదు. అర్ధరాత్రి బుల్డోజర్లు పంపించి హెచ్‌సీయు భూముల్లో విధ్వంసం సృష్టించిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై మోడీ విమర్శలు చేశారు. మరి రాజ్యాంగాన్ని, చట్టాలను

2లో..

SHARP న్యూస్ జాతీయ తెలుగు దినపత్రిక


# చెంబుడు నీళ్ళు...గుప్పెడు మట్టి !

### అమరావతికి మోడీ చేసిందేంటి ?: షర్మిల

విజయవాడ, షార్ప్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాజధానికి ప్రధాని నరేంద్ర మోడీ చేసిందేమీ లేదని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. ఆనాడు గాలి మోటార్లో తిరిగి ఆంధ్రుల నెత్తి మీద మట్టి కొట్టారు. ఇప్పుడు మళ్ళీ సున్నం కొట్టడానికి వస్తున్నారని అన్నారు. రాజధాని అమరావతి పున:ప్రతిష్ట కార్యక్రమానికి ప్రధాని మోడీ రాకను షర్మిల వ్యతిరేకించారు. చివరికి ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతిని మోడీ శంకుస్థాపనల ప్రాజెక్ట్ కింద మార్చేశారు. రాజధాని నిర్మాణంపై బీజేపీ చేస్తోంది ఘరానా మోసం. రాష్ట్రానికి ద్రోహం చేసింది. పోలవరం ఎత్తు తగ్గించి తీరని అన్యాయం చేసిందని షర్మిల ఆరోపించారు. రూ. 15వేల కోట్లు అప్పు ఇచ్చి రాజధానిని ఉద్ధరించినట్లు గొప్పలు చెప్పడం సిగ్గుచేటు, నిజంగా అమరావతిపై చిత్తశుద్ధి ఉంటే 9 ఏళ్లు ఏం చేశారని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతుంటే వేడుక చూసింది మీరు కాదా ? ఇది తప్పని మీ దత్తపుత్రుడిని ఎందుకు వారించలేదు ? అమరావతి రైతుల ఉద్యమం ఢిల్లీ దాకా పాకితే కనీసం ఎందుకు స్పందించలేదని షర్మిల్ ప్రశ్నించారు. ఢిల్లీని మించిన రాజధాని కట్టిస్తామని ఇచ్చిన హామీ మరిచిపోయారా ?- ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు చేసి ఇప్పుడు మళ్ళీ ఏ మొహం పెట్టుకొని అమరావతికి వస్తున్నారని మోడీని ప్రశ్నించారు షర్మిల సోనియా, రాహుల్ పై ఈడీ కేసులు పెట్టడాన్ని ఏపీసీసీ చీఫ్ షర్మిల తప్పుబట్టారు. కాంగ్రెస్ అంటే భయం పట్టుకుందనీ, అందుకే దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుతుందని మండిపడ్డారు. ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయించి, అగ్ర నాయకత్వాన్ని అణగదొక్కాలని చూస్తుందని ఆరోపించారు షర్మిల.

## జగన్ అక్రమాస్తులో
# రూ.793 కోట్ల ఆస్తుల జప్తు

### – ఈడీ కీలక ఆదేశాలు

అమరావతి, షార్ప్ న్యూస్ : మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో చాలా కాలం తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. దాల్మియా సిమెంట్స్‌కు చెందిన రూ.793 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. 2013లో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ ఆధారంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కడప జిల్లాలో సున్నపురాయి గనుల లీజుల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, అప్పట్లో దాల్మియా సిమెంట్స్ వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో దాదాపు రూ. 150 కోట్ల లాభాన్ని జగన్ పొందారని సీబీఐ తేల్చింది. ఈ ఆధారాలతో ఈడీ మనీ లాండరింగ్ జరిగిందని నిర్ధారించి, ఆస్తులను జప్తు చేస్తోంది. ఈడీ విచారణలో, జగన్ షేర్ల రూపంలో రూ. 95 కోట్లు, హవాలా మార్గంలో రూ. 55 కోట్లు మొత్తం రూ. 150 కోట్ల దాకా లబ్ధి పొందినట్లు గుర్తించింది. వీటిలో రఘురాం సిమెంట్స్ అనే కంపెనీలో షేర్లు పెట్టారు. ఆ సంస్థ తరువాత భారతి సిమెంట్స్‌గా మారింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న 417 హెక్టార్ల సున్నపురాయి గనుల భూములను వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో దాల్మియా సిమెంట్స్‌కు లీజుగా మంజూరు చేశారు. దీని బదులుగా, జగన్‌కు సంబంధించిన సాక్షి మీడియా గ్రూప్ సహా ఇతర సంస్థలలో భారీగా పెట్టుబడులు వచ్చాయని సీబీఐ నిర్ధారించింది. దాల్మియా సంస్థ నుంచి వచ్చిన ఈ పెట్టుబడులను అక్రమ ఆదాయంగా ఈడీ గుర్తించింది. గతంలో, ఈ కేసులో దాల్మియా సిమెంట్స్ డైరెక్టర్ పునీత్ దాల్మియా తనపై కేసు రద్దు చేయాలంటూ, తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, విచారణకు ఎప్పుడూ హాజరుకాలేదు. 2021లో, విచారణ వాయిదా కోరినందుకు హైకోర్టు ఆయనకు రోజుకు రూ. 50,000 ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. ప్రస్తుతం జగన్ అక్రమాస్తుల కేసులు తెలంగాణ హైకోర్టుతో పాటు సీబీఐ కోర్టుల్లో విచారణలో ఉన్నాయి. సుప్రీంకోర్టు ఈ విచారణను వేగవంతం చేయాలని ఆదేశించింది. అయినా వాటిల్లో కదలికలేదు. అయితే, సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిన 13 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఈడీ ఆస్తుల జప్తు చర్య తీసుకోవడం రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. కొంతకాలంగా ఈ కేసులో దర్యాప్తు నిలిచిపోయిన పరిస్థితిలో, ఈడీ తీసుకున్న ఈ చర్యతో ఇకపై విచారణలు వేగవంతం కావొచ్చని భావిస్తున్నారు.

# 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

### – 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్న భట్టి

**హైదరాబాద్** పుప్పాలగూడలో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులు, రెవెన్యూ, స్పెషల్ పోలీసు సొసైటీలకు కేటాయించిన భూముల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. పుప్పాలగూడలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, రెవెన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ సొసైటీలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన 200 ఎకరాలను సుప్రీంకోర్టు రద్దు చేసినట్లు అధికారులు వివరించారు. వాటి పక్కన టీజీఐఐసీకి చెందిన మరో 250 ఎకరాలు ఉన్నట్లు మంత్రులకు తెలిపారు. ఏఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ స్పష్టం చేసింది. పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్ అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# తొలి రోజే బిగ్ డీల్

ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతోపాటు ఇతర మల్టీనేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. దీంతో దాదాపు రూ. 5 వేల కోట్లకుపైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలున్నాయి. కాగా, మరుబెనీ ఇండస్ట్రియల్ పార్క్ ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి సారిస్తుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నైపుణ్య ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనీకి స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్క్ ఇదేనని తెలిపారు. ఈ ఒప్పందంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. జీవనోపాధి మెరుగుపడుతుందని సీఎం రేవంత్ తెలిపారు. తెలంగాణలో పరిశ్రమలకు అనువైన అవకాశాలున్నాయని మారుబెనీకి ప్రభుత్వం తరపున తగినంత మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భారతదేశంతో జపాన్‌కు అనేక ఏళ్లుగా స్నేహ సంబంధాలున్నాయన్నారు సీఎం రేవంత్. అందుకే ఇక్కడి పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారన్నారు. తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతను మారుబెని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దైనకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు తాము ఆసక్తిగా ఉన్నామని, అక్కడి అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని సకాకురా పేర్కొన్నారు. మారుబెనీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా 65 దేశాలలో 410కిపైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, గనులు, లోహాలు, ఇంధనం, విద్యుత్, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, మొబిలిటీ, ఏరోస్పేస్ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు 50వేలకుపైగా ఉద్యోగులు ఉన్నారు.

# వక్ఫ్ ఆస్తుల్లో మార్పులు చేయొద్దు: సుప్రీంకోర్టు

చేయరాదని, వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించరాదని ఆదేశించింది. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను కూడా డీనోటిఫై చేయొద్దని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో సమగ్రమైన సమాధానం ఇవ్వాలని, తర్వాత ఐదు రోజుల్లో పిటిషనర్లకు రిజాయండర్ దాఖలు చేసే అవకాశం ఇస్తామని తెలిపింది. ఈ సందర్భంగా సీజేఐ చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వక్ఫ్ బై యూజర్‌గా వాడుతున్న, అంటే చాలా కాలంగా ముస్లిం మతపరమైన కార్యక్రమాల కోసం వాడుతున్న ఆస్తులను డీనోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. "హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా, అలాగే ముస్లింల ఆస్తులు ముస్లింలే నిర్వహించాలనే భావన ఉంది. కానీ పార్లమెంటుకు చట్టాలు రూపొందించే అధికారం ఉందని కూడా మరిచిపోవద్దు. ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని చెబుతున్నారు. చారిత్రక లేదా పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడం న్యాయసమ్మతం కాదు," అని ఆయన స్పష్టం చేశారు. మే 5న సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరుగుతుంది.

# కొత్త పవర్ సెంటర్‌గా కవిత



కేటీఆర్ తో సంబంధం లేకుండా, పార్టీ పరంగా తన పరిధి దాటి మరీ కవిత చేస్తున్న ప్రకటనలు హాట్ టాపిక్ గా మారాయి. ఈమధ్య బాన్సువాడలో పార్టీ మీటింగ్ లో పాల్గొన్న కవిత... పార్టీ కార్యకర్తలను వేధించిన వారి పేర్లు పింక్ బుక్ లో రాసిపెట్టండి..వాళ్ళల్లో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోనని కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. ఇదే కాకుండా మళ్ళీ సంచలన ప్రకటన చేశారు. పార్టీని వీడి వెళ్లిన వారిని మళ్లీ చేర్చుకునేది లేదని కవిత ప్రకటించారు. నిజానికి ఈ ప్రకటన పార్టీ అధ్యక్షుడో, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటో చెబితే బాగుండేది. కానీ, కవిత తానే లీడ్ తీసుకొని ఈ ప్రకటన చేయడమేంటని అంతా ఆశ్చర్యపోతున్నారు. సొంత ఎజెండాతో కవిత కొన్నాళ్లుగా కవిత బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా సొంత ఎజెండాతో రాజకీయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీలో తనకంటూ సొంత ఇమేజ్ సంపాదించుకోవాలని ఆరాటపడుతున్నారు. మొదట బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం మొదలుపెట్టారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై పార్టీతో సంబంధం లేకుండా దీక్షలు, నిరసనలు చేపట్టిన కవిత..ఈ వ్యవహారం కేంద్రం పరిధిలోకి వెళ్లడంతో సైలెంట్ అయ్యారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేలా కవిత యాక్షన్ ప్లాన్ ఎందుకు చేపట్టలేదని కాంగ్రెస్ వర్గాలు విమర్శించాయి. కేంద్రంపై ఎందుకు వాయిస్ రైజ్ చేయలేదని ప్రశ్నించారు. అయితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ విషయంలో ఈడీ, సీబీఐ కేసుల్లో ఉన్న కవిత... కేంద్రంతో కొట్లాటకు దిగబోరని కూడా కాంగ్రెస్ వర్గాలు విమర్శించాయి. కేంద్రం సంగతి పక్కనబెడితే, రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకొని కాంగ్రెస్ పైనే ఫోకస్ పెంచారు కవిత. కవిత చేపడుతున్న ధర్నాలు, ఆందోళనలు వరకూ ఒకే. కానీ ఆమె చేస్తున్న విధానపరమైన నిర్ణయాలు, ప్రకటనలను గులాబీ బాస్ కి తెలిసే జరుగుతున్నాయా ? పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆమోదం ఉందా అన్న అనుమానాలు వస్తున్నాయి. లేకపోతే బీఆర్ఎస్ లో గ్రిప్ పెంచుకునేందుకు సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారా అని పార్టీ శ్రేణుల్లో డౌట్ వ్యక్తమవుతోంది. ఏదేమైనా ఎన్నికల నాటికి సొంత ఎజెండాతో ముందుకెళ్ళాలని మాత్రం కవిత అనుకుంటున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది.

# కేసీఆర్‌కు సిగ్గుందా ? భూములపై చర్చకు రెడీ

ఉద్యోగాలు వస్తాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్, బీజేపీ నేతల పనిగా పెట్టుకున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములను చౌకగా అమ్మేశారు. గతంలో కోర్టులు అనేక సార్లు బీఆర్ఎస్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేశాయన్నారు పీసీసీ ఛీఫ్. కోర్టులంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందనీ, హెచ్చీసీయూ భూముల ఏఐ టెక్నాలజీ ఫేక్ వీడియోలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా రీట్వీట్ చేశారని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ కూడా భూములకు సంబంధించి తప్పుగా మాట్లాడారు. రేవంత్ రెడ్డిని సీఎం పదవిని నుంచి దిగిపోవాలని చెప్పడానికి కేటీఆర్ కి సిగుండాలని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్. దేశ చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో రౌడీలకి కొదవలేదనీ, కవిత కూడా అందుకే ఢిల్లీ వెళ్లి లిక్కర్ దందా చేసిందన్నారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.

# రేవంత్ ని కాపాడేది మోడీయే : కేటీఆర్

అపహాస్యం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర సంస్థలతో విచారణ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ సీబీఐను దుర్వినియోగం చేస్తే, ఇప్పుడు బీజేపీ ఈడీని దారుణంగా వాడుకుతోందని విమర్శించారు.

# ఫిరాయింపుల సంస్కృతి కాంగ్రెస్ దే

ఈ దేశంలో ఫిరాయింపుల సంస్కృతిని తెచ్చింది ఇందిరా గాంధీయేనని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఎజెండా తమకు లేదని లేదన్నారు కేటీఆర్. రేవంత్ అనైతిక చర్యలతో జనంలో తిరుగుబాటు వస్తుందన్నారు. ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. ఎవరైనా రాజకీయ నేతలు అధికారం అహంకారంతో నియంతలుగా, చక్రవర్తులుగా భావిస్తే ప్రజాస్వామ్యంలో వారికి స్థానం ఉండదని అన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. సుప్రీంకోర్టులో జస్టిస్ గవాయి నేతృత్వంలో వాదనలు జరిగాక ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత గౌరవం పెరిగిందన్నారు. హెచ్‌సీయు భూముల్లో తాత్కాలిక జైలు ఏర్పాటు చేసి అధికారులను పంపిస్తామని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల్ని అందరూ సీరియస్‌గా తీసుకోవాలన్నారు కేటీఆర్. హెచ్‌సీయులో నరికిన 100 ఎకరాల చెట్లను ఎప్పుడు, ఎలా పునరుద్ధరిస్తారో స్పష్టంగా చెప్పకపోతే, అధికారులను జైలుకు పంపుతామని సుప్రీంకోర్టు చెప్పడాన్ని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. సుప్రీంకోర్టు నియమించిన సెంట్రల్ ఎంపవర్ కమిటీ, హెచ్‌సీయు భూముల విషయంలో భారీ ఆర్థిక మోసం జరిగిందని స్పష్టం చేసింది. ఆ 400 ఎకరాలు యూనివర్సిటీకి చెందిందేనని తేల్చి చెప్పింది. భూ యాజమాన్య హక్కులు తేలే వరకూ అక్కడ నిర్మాణాలు, లీజులు, తాత్కాలిక కట్టడాలన్నింటినీ వెంటనే ఆపాలని సూచించింది. ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కూడా స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్, ఆర్బీఐ, సివీసీ జోక్యం చేసుకోవాలని తాము గతంలో కోరామని, ఇప్పుడు తమ ఆరోపణలు నిజమని సెంట్రల్ ఎంపవర్ కమిటీ నివేదిక ద్వారా కూడా తేలిందన్నారు కేటీఆర్.

## తెలంగాణలో గ్రూప్ 1
# నియామకాలకు బ్రేక్




హైదరాబాద్, షార్ప్ న్యూస్ : తెలంగాణలో గ్రూపు-1 నియామకాలకు హైకోర్టు బ్రేక్ వేసింది. కోర్టులో విచారణ పూర్తయ్యే దాకా అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి అనుమతి ఇచ్చింది. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ 20 మంది దాకా నిరుద్యోగ అభ్యర్థులు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ షిటిషన్లను విచారణకు స్వీకరించింది కోర్టు. తుది విచారణ పూర్తయ్యే దాకా అభ్యర్థులకు ఎలాంటి రిక్రూట్ మెంట్ లెటర్స్ ఇవ్వొద్దని ఆదేశించింది. కొన్ని రోజులుగా గ్రూప్-1పై లొల్లి జరుగుతోంది. తెలుగు మీడియంలో అభ్యర్థులకు తక్కువ మార్కులు రావడం, ఫైనల్ ర్యాంకుల్లో ఎక్కువ మంది ఇంగ్లీష్ మీడియం వాళ్ళే ఉండటంపైనా వివాదం చెలరేగింది. కొన్ని సెంటర్లలోనే ఎక్కువ మంది ఫైనల్ లిస్టులో ఉన్నారనీ, అక్కడ అవకతవకలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. జీఆర్ఎల్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని అభ్యర్థులు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మెయిన్స్ పత్రాలను సరిగా దిద్దకపోవడం వల్ల అభ్యర్థులు నష్టపోయారని పిటిషనర్లు తెలిపారు. మూల్యాంకనం, నియామకాలు నిబంధనలకు విరుద్ధమని, తిరిగి వ్యాల్యుయేషన్ చేయాలని, లేదంటే మరోసారి మెయిన్స్ నిర్వహించాలని కోర్టుకు విన్నవించారు. పేపర్ల వ్యాల్యుయేషన్ పై హైకోర్టు పర్యవేక్షణ లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ పిటిషన్ లో తెలంగాణ ప్రభుత్వం, టీజీపీఎస్సీని ప్రతివాదులుగా చేర్చారు.

### కోట్లు చేతులు మారాయన్న బీఆర్ఎస్

గ్రూప్-1 పరీక్షపై రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నియామకాల్లో కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని తెలిపారు. పరీక్ష రాయని 10 మంది మెయిన్స్ రిజల్ట్స్ లో ఎలా కనిపించారని ప్రశ్నించారు. పరీక్షను వెంటనే రద్దు చేసి సీబీఐ విచారణ జరిపించాలని కౌసిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మరికొందరు ప్రతిపక్ష నేతలు కూడా గ్రూప్-1పై విమర్శలు చేశారు. టీజీపీఎస్సీ మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. ఈ వివాదాలపైనే అభ్యర్థులు 20 మంది దాకా హైకోర్టు ఆశ్రయించారు. నియామక ప్రక్రియపై స్టే ఇవ్వడానికి మాత్రం హైకోర్టు నిరాకరించింది. అయితే తుది విచారణ పూర్తయ్యే వరకూ నియామకపత్రాలను ఇవ్వొద్దని టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి హైకోర్టు వాయిదా వేసింది.

# పేదవాడి సొంత ఇంటి కల నెరవేరాలి

### – కమ్యూనిస్టుల పోరాట ఫలితమే ఇళ్ల స్థలాల సాధన
### – సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ



**పొన్నూరు** భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ పొన్నూరు నియోజకవర్గం, ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ, అర్హులైన నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెలలో మూడు సెంట్లు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్నాలలో రెండు సెంట్లు పల్లెలో మూడు సెంట్లు ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వడమే కాకుండా మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి, జీవో విడుదల చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పొన్నూరు తహసిల్దార్ కార్యాలయం లో వ్యక్తిగత అర్జీలు సమర్పించడం జరిగిందన్నారు. పేదవాడి పక్షాన ఎర్ర జెండా పోరాడుతూనే ఉంటుందన్నారు. ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా భూమిలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు రైతులకు సాగు భూములు పంచి పెట్టిన ఘనత సిపిఐ కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని అర్హులైన పేదలకు పట్టణాలలో రెండు సెంట్లు పల్లెలలో మూడు సెంట్లు ఇవ్వటంతో పాటు గృహపకరణాలు పెరిగిన దృశ్య ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు 5 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, ఎల్లమ్మ, శారద, మదీనా, షకీల, యశోద, సారమ్మ, పద్మావతి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఉద్యోగాల జాతర !



దాంతో రెండు మూడు రోజుల్లో వివిధ శాఖల అధికారులు సమావేశమై ఖాళీలను ఖరారు చేసి, జూన్ 2లోగా పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారని సమాచారం.

### ఏ శాఖలో ఎన్ని పోస్టులంటే..?

ఈసారి ఏ శాఖలైనా వీలైనన్ని పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖాళీల లెక్కలు ఇలా ఉన్నాయి: పోలీసు శాఖ: కానిస్టేబుళ్లు – 10,500, ఎస్ఐలు –1,650 వైద్య ఆరోగ్య శాఖ: అసిస్టెంట్ ప్రొఫెసర్లు – 612, డాక్టర్లు – 2,150, నర్సులు – దాదాపు 2,000, ఇతర స్టాఫ్ (ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సులు) – 5,000కి పైగా పోస్టులు ఇంజినీరింగ్ శాఖలు: మొత్తం ఖాళీలు – 2,500కి పైగా ఆర్టీసీ (RTC): ఖాళీలు – 3,038 (గ్రూప్–1, 2, 3, 4: మొత్తం ఖాళీలు %- 18,236% గురుకుల/ఉపాధ్యాయ పోస్టులు: గత నియామకాల్లో రెండు వేల పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మారాయి. ఈసారి భారీగా భర్తీ చేసే అవకాశం. వ్యవసాయ శాఖ: ఖాళీలు – 148%ఆర్ అండ్ బీ శాఖ: ఖాళీలు –185 నుంచి 200 వరకుఅటవీ శాఖ: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 1393 పోస్టులుమహిళా శిశు సంక్షేమ శాఖ: అంగన్‌వాడీ టీచర్లు – 6,399, హెల్పర్లు – 7,837, మొత్తం – 14,236 పోస్టులు గ్రామ పరిపాలన అధికారి (GPO) పోస్టులుగా 10,954 ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది. వీటిలో 6 వేల మంది పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏలు ఇప్పటికే అంగీకారం తెలిపారు. వీళ్ళ రిక్రూట్ మెంట్ ఇంకా మొదలు కాలేదు. అయితే మిగిలిన 4 వేల పైగా పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ రానుంది. ఇక స్కిల్ యూనివర్సిటీలు, హ్యాండ్లూమ్ %డ% టెక్స్టైల్ ఇన్స్టిట్యూట్లు, టెక్నాలజీ సెంటర్లు, న్యాయశాఖ, సచివాలయం, ఆర్థికశాఖల్లో కలిపి మరో 7,8వేల పోస్టులు భర్తీకి అవకాశం ఉంది. మొత్తమ్మీద ఈ ఏడాది తెలంగాణలో 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ అయ్యే అవకాశముంది. ఇది నిరుద్యోగ యువతకు మంచి అవకాశం.

### ప్రిపరేషన్ మొదలు పెట్టండి

ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో తెలంగాణలో ఇక వరుసగా ఉద్యోగాల నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల నిరుద్యోగ అభ్యర్థులు తమ ప్రిపరేషన్ మొదలు పెట్టాలని తెలంగాణ ఎగ్జామ్స్, ఎగ్జామ్స్ సెంటర్247 వెబ్ సైట్, యాప్స్ నిర్వాహకులు,సీనియర్ జర్నలిస్ట్ మేడుకొండూరు విష్ణుకుమార్ కోరారు. డిసెంబర్ 2024లో గ్రూప్ 2 ఎగ్జామ్ ముగిసిన తర్వాత చాలా మంది ప్రిపరేషన్ కు ఫుల్ స్టాప్ పెట్టారు. నిరంతరం ప్రిపరేషన్ లో ఉంటేనే ప్రభుత్వ కొలువులు కొట్టడానికి అవకాశం ఉంటుంది. అందువల్ల మంచి స్కోరింగ్ ఉన్న సబ్జెక్టులకు ఎక్కువ టైమ్ కేటాయించుకొని ప్రిపరేషన్ మొదలు పెట్టాలి. రోజువారీ, వారం, నెల వారీగా సిలబస్ ఛార్ట్ వేసుకోవడంతో పాటు, టైమింగ్ ఖచ్చితంగా పాటించాలని విష్ణుకుమార్ సూచించారు. తమ తెలంగాణ ఎగ్జామ్స్, ఎగ్జామ్స్ సెంటర్ 247 వెబ్ సైట్స్, యాప్స్ లో ఆన్ లైన్ లో వీడియో కోర్సులు, టెస్ట్ సిరీస్ లను అందుబాటులోకి తెస్తున్నట్టు వివరించారు.

### షార్ప్ న్యూస్ ఈ-పేపర్ లో స్పెషల్ పేజీ

**తెలంగాణలో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారి కోసం షార్ప్ న్యూస్ డైలీ పేపర్ లో ప్రత్యేకంగా పేజీని కేటాయిస్తున్నాం. వచ్చే వారం నుంచి ఈ స్పెషల్ పేజీ మీకు అందుబాటులోకి వస్తుంది. ఇందులో కరెంట్ ఎఫైర్స్ క్విజ్ తో పాటు, ప్రిపరేషన్ టిప్స్, విద్య, ఉద్యోగ సమాచారం, మోటివేషన్ టిప్స్, సిలబస్ ఛార్జ్ లకు సంబంధించిన ఆర్టికల్స్ ను అందుబాటులోకి తీసుకొస్తాం.**

# మావోయిస్టులు లొంగిపోయి అభివృద్ధికి సహకరించాలి





భద్రాచలం, షార్ప్ న్యూస్ : ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా లాంటి కనీస సౌకర్యాలు అందించడమే లక్ష్యమని భద్రాచలం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పూసుగుప్ప గ్రామం నుంచి చత్తీస్‌గఢ్ సరిహద్దు వరకు నిర్మించిన 2 కిలోమీటర్ల బీటీ రోడ్డును గురువారం ఆయన సందర్శించారు. చర్ల నుంచి టూ వీలర్ మీద ప్రయాణించి, నిర్మాణంలో ఉన్న కాజ్ వేలు, కల్వర్టుల పనులను పరిశీలించారు. తర్వాత పూసుగుప్ప గ్రామానికి వెళ్ళి, అక్కడి నుంచి ఇటీవల 3 కోట్ల రూపాయలతో పూర్తి చేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు చత్తీస్‌గఢ్ లోని రాంపురం, భీమారం గ్రామాల్లో నివసించే ఆదివాసీలకు ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ఈ ప్రజలను అభివృద్ధికి దూరం చేయాలని మావోయిస్టులు ప్రయత్నిస్తున్నా, ప్రభుత్వం తరపున పోలీస్ శాఖ విద్య, వైద్యం, రవాణా లాంటి అవసరమైన సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. త్వరలో పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాల్లో మొబైల్ హాస్పిటళ్లను ప్రారంభిస్తామని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి అవసరమైన ఏ కార్యక్రమమైనా ముందుండి పూర్తిచేయడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానానికి ఆకర్షితులై మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న పలువురు క్యాడర్లు ఇప్పటికే లొంగిపోయారు. మిగిలిన నాయకులు, సభ్యులు కూడా లొంగిపోయి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతితో రైతులకు భరోసా

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ (షార్ప్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి %-% కొత్త ఆర్ఓఆర్ చట్టం రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందిస్తుందని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. కమ్మర్ పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, బట్టాపూర్ గ్రామాల్లో జరిగిన రైతు అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ వివరించారు. ఈ కొత్త చట్టంతో రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూమి హక్కుల భద్రత, భూ వివాదాల పరిష్కారం, వేగవంతమైన సేవల ద్వారా రైతులకు మేలు జరిగేలా చూస్తామన్నారు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో భూభారతి చట్టాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. అక్కడ కనిపించే ఇతర సమస్యలను గమనించి చట్టంలో మార్పులు చేర్పులు చేస్తారని కలెక్టర్ వివరించారు. మే మొదటి వారం నుంచి రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి చట్టం అమలవుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా విచారణ నిర్వహించి, రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. పేద రైతులు అప్పీలు చేసుకునే సందర్భంలో వారికి ఉచిత న్యాయసాయం అందజేస్తామని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు రైతులు తమ అభ్యంతరాలు, సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.

## పంచాయతీ కార్మికులకు జీతాలేవి ?



నిజామాబాద్, షార్ప్ న్యూస్ : గ్రామపంచాయతీ కార్మికుల వేతన సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆందోళన నిర్వహించింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ ధర్నా చౌక్ దగ్గర టీయూసీఐ ఆధ్వర్యంలో ఒక్కరోజు టోకెన్ సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. తర్వాత జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ముత్తెన్న, కార్యదర్శి ఎం.సుధాకర్, యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్.రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 12,740 గ్రామపంచాయతీల్లో దాదాపు 60 వేల మంది కార్మికులు వివిధ విధుల్లో పనిచేస్తున్నారు. వీళ్ళకి నెలలు తరబడి వేతనాలు అందకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలో చాలా గ్రామపంచాయతీల్లో 5 నుంచి 6 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని టీయూసీఐ డిమాండ్ చేశారు., జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలి. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. రిటైర్మెంట్ సమయంలో ఐదు లక్షల రూపాయల బెనిఫిట్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో 30 శాతం పీఆర్సీ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, రాష్ట్ర నాయకులు సత్తెక్క, జిల్లా నాయకులు బి.మురళి, కిరణ్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## వీధి రౌడీల్లా కాంగ్రెస్ లీడర్లు : ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ జిల్లా, షార్ప్ న్యూస్ : కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీల్లా వ్యవహరించడమేంటని నిజామాబాద్ జిల్లా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీల పేర్లు చార్జ్‌షీట్‌లో చేర్చడంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై అశ్లీల వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణాలకు నిలయం. నిజాలు బయటపడితే చూసి తట్టుకోలేకపోతున్నారు. బీజేపీ నాయకులపై, ప్రధాని మోడీపై అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించే చర్యలేనని ధన్ పాల్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు తమ మాటలను అదుపులో ఉంచుకోవాలని, వీధి గుండాల్లా వ్యవహరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే ధన్ పాల్ హెచ్చరించారు.

## గాంధీభవన్ ముట్టడించిన విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ లెక్చరర్లు

**హైదరాబాద్** గురువారం నాడు విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ లెక్చరర్లు గాంధీభవన్ ను ముట్టడించారు. తెలంగాణ రాష్ట్రంలో 12 విశ్వ విద్యాలయాలలో 14 వందల మంది పనిచేస్తున్న టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు . యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చిందని కాంట్రాక్టు లెక్చరర్ లు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచిన కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు. యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్ లు రోడ్డున పడే దుస్థితి నెలకొనిఉందని ,యూనివర్సిటీ విసిలు కూడా తమను బేఖాతరు చేయడం వల్ల ధర్నాలకు దిగవలసి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి వినతి చేసారు.

## ఇసుక తవ్వకాల కోసం రోడ్డు ఆక్రమణ







**పలమనేరు, షార్ప్ న్యూస్ :** చిత్తూరు జిల్లాలో ఇసుక అక్రమ రవాణా కోసం గ్రామాలకు వెళ్ళే రోడ్లను ఆక్రమిస్తున్నారు అక్రమార్కులు. పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం కంగాణంబండ దగ్గర్లోని కౌండిన్యనదిలో ప్రతి రోజూ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. పార్టీలకతీతంగా ముదరంపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్సీపి కార్యకర్తలు అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తుంది. శంకర్రాయలపేట గ్రామం దగ్గర్లోని దొరచెరువు నుంచి దండపల్లి చెరువు మధ్యన వెళ్లే కౌండిన్య నదిలో ఎన్నో రోజులుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు. బొమ్మరాజుపల్లి నుంచి కంగాణం బండ వరకు రోడ్డు ఇబ్బందిగా ఉందని అప్పట్లో మంత్రిగా ఉన్న అమర్నాథరెడ్డిని కలిసి రెండు గ్రామాల సమస్యను చెప్పుకున్నారు. రోడ్డు మంజూరు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేగా మళ్ళీ గెలిచారు. కానీ ఇసుక అక్రమ రవాణాకు చెక్ పడటం లేదు. రోడ్డు లేకపోవడం వల్ల రెండు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

## తప్పుడు ర్యాంకులతో కార్పొరేట్ మోసాలు : ట్రస్మా ఫిర్యాదు



సత్తుపల్లి, షార్ప్ న్యూస్ : సత్తుపల్లిలో కొన్ని కార్పొరేట్ స్కూళ్లు విజయవాడ, గుడివాడ లాంటి ప్రాంతాల నుంచి మెరిట్ విద్యార్థులను తీసుకొచ్చి ఇక్కడ ఎగ్జామ్ రాయించి మోసం చేస్తున్నాయని ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆరోపించింది. సత్తుపల్లిలో 10వ తరగతి పరీక్షలు రాయించి, ఆ ర్యాంకులను స్థానిక బ్రాంచ్‌కి చెందినవిగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించింది. దీనిపై గురువారం ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు కలిసి ఎంఈఓ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

ఓ కార్పొరేట్ స్కూల్ ప్రభుత్వ గుర్తింపు లేకపోయినా అడ్మిషన్లు తీసుకుంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. ఈ కార్పొరేట్ స్కూల్స్ పాఠ్య పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను ఎంఆర్పీ లేకుండా అమ్ముతూ నిబంధనలకు విరుద్ధంగా దోపిడీ చేస్తున్నారని తెలిపారు. టాలెంట్ టెస్టులు, అడ్మిషన్ టెస్టుల పేరుతో విద్యార్థులకు వారి స్థాయికి మించి ప్రశ్నాపత్రాలు ఇస్తూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ట్రస్మా ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులను క్లాసుల్లో వదిలేసి, టీచర్లను ఎండా, వాన లేకుండా అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిప్పుతూ ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అడ్మిషన్లు తెస్తేనే ఉద్యోగం ఉంటుందని బెదిరింపులకు పాల్పడుతున్న స్కూల్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ట్రస్మా ప్రతినిధులు ఎంఈఓను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఈఓ రాజేశ్వరరావు, ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి




బద్వేలు కడప జిల్లాలోని బద్వేల్ మండలం తొట్టిగారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. తిప్పనపల్లె కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాకీ ప్రభావతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన వ్యక్తం చేస్తున్న కార్యక్రమంలో భాగంగా మేము ఈరోజు తొట్టిగరిపల్లె పిహెచ్సిలో మా నిరసనను వ్యక్తం చేస్తున్నాం. మా ప్రధాన డిమాండ్లు మేమంతా గిరిజన, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలలో కమ్యూనిటీ ఆఫీసర్లుగా 2019 సంవత్సరం నుండి పనిచేస్తున్నామని, సెంట్రల్ గవర్నమెంట్ గైడ్లైన్స్ ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారిని రెగ్యులరైజ్ చేయాలని చెప్పింది. దానిపైన మాకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన భద్రత కల్పించాలని అడుగుతున్నాం. గత సంవత్సరంలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న 187 కాడెర్ల ఉద్యోగులందరికీ జీతం పెంచి కేవలం మా కేడర్ సిహెచ్‌ఓస్ కి మాత్రం 23% జీతం పెరుగుదల ఇవ్వలేదు. దీనిపైన స్పష్టతను రాష్ట్ర ప్రభుత్వం మాకు ఇవ్వాలి అని ఆమె తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శీలం సుస్మిత మాట్లాడుతూ మాకు జీతంతో పాటు పిఎఫ్ అమౌంట్ కట్ అయ్యేది. గత సంవత్సర కాలంగా మాకు పిఎఫ్ అమౌంట్ కట్ అవ్వడం లేదు మాకు పిఎఫ్ అమౌంట్ విషయంలో న్యాయం చేయాలి. మాకు జీతం కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే ప్రోత్సాహకం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది ఈ ప్రోత్సాహకాలు సంవత్సరం కాలంగా ఆగిపోయాయి. ప్రోత్సాహకాలు అప్పుడప్పుడు ఇవ్వడంతో పాటు వాటిలో కొత కొస్తున్నారు అలా ఎందుకు అని అడిగితే వాటి కారణాలు చెప్పడం లేదు. మాకు ఒక నిర్ణీత జీతాన్ని నిర్ణయించి ప్రతి నెల జీతం చెల్లించాలని అడుగుతున్నాం. అదేవిధంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఒక నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో నాగదాసరి శిరీష చింతు రాధా, సామతోటి జోష్ణ, కొరముట్ల వీణ, బసవరాజ్

# కార్మికుల పెండింగ్ జీతలకు మూడు కోట్లకు 10శాతం కమిషన్ ఇస్తే రిలీజ్ చేస్తారా

**- హాస్పిటల్ సూపరింటెండెంట్ పెండింగ్ జీతాల కోసం ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోలేదు**

**- కార్మికుల జీతలకు మూడు కోట్లు చెక్ ఇచ్చిన ఉపయోగం లేకుంటే**




**కరీంనగర్** కరీంనగర్ ప్రభుత్వ హాస్పటల్ వర్కర్స్ ఽ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హాస్పటల్ ముందు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కార్మికులు విధులు బహిస్కరించి ధర్నా చేయడం జరుగుతున్నది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ జీతలకు డిఎమ్ఈ హైదరాబాద్ వారు మూడు కోట్లు చెక్ రిలీజ్ చేసిన ఇంకా పెండింగ్ లో ఉండటం ఏమిటని ప్రశ్నించారు. మూడు కోట్లకు 10శాతం కమిషన్ ఇస్తే రిలీజ్ చేస్తారా అని. ప్రశ్నించారు. అట్లా అయితే కార్మికులం అందరం కలసి బిచ్చమెత్తి ఇస్తామని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వీరారెడ్డి కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలు రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు గత వారం క్రితం సమ్మె విరమించినము కానీ పెండింగ్ జీతాలు ఇవ్వడంలో అధికారులు విఫలమైనరాని విమర్శించారు. కార్మికులు అంటేనే అధికారులు ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. మూడు నెలలు జీతాలు ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. చేసిన పనికి జీతం ఇవ్వాలని ధర్నా చేస్తే అధికారులు కార్మికుల వద్దకు వచ్చి బెదిరిస్తున్నారని వాపోయారు. వరంగల్ నుండి లేదా కూలీలను తెచ్చి హాస్పటల్లో పనిచేపిస్తామని వారికీ రోజుకు 500/-లు ఇస్తామని ప్రభుత్వ హాస్పటల్ అధికారులు బెదిరింపులు చేస్తున్నారని అన్నారు. అవే డబ్బులు కార్మికులకు ఇస్తే చేస్తారు అంటే ఇవ్వమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల జీతాల కోసం డిఎమ్ఈ హైదరాబాద్వారు 3కోట్ల చెక్ ఇచ్చిన ఫైనాన్స్ నుండి అప్రూవల్ రాలేదని కొర్రిలు పెడుతున్నారనీ అన్నారు. కార్మికుల జీతాల బడ్జెట్ కూడా ప్రభుత్వ ప్రభుత్వానికి 10 శాతం కమిషన్ ఇవ్వాళా అని ప్రశ్నించారు. పెండింగ్ జీతాలు వచ్చే వరకు విధులు బహిస్కరించి ధర్నా చేస్తామని అన్నారు. ప్రభుత్వాన్ని గొంతమ్మ కోరికలు కోరడం లేదని కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రతినెల 5వ తేదీలోపు కార్మికులకు జీతాలు చెల్లించాలి. కార్మికులచే టాయిలెట్స్ బాత్రూమ్స్ క్లీనింగ్ చేయించకూడదని దీనికోసం ప్రత్యేక స్కావెంజర్సు నియమించాలని. కార్మికులకు గుర్తింపు కార్డులు రెండు జతల బట్టలు ఇవ్వాలని, పిఎఫ్ ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి. అరుణ్ టి. కళావతి నాయకులు సుమన్ మహేష్ మౌనిక రాజయ్య రజిత అరుణ కార్మికులందరు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్**






**మంథని** అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్ని మాపక కార్యాలయానికి ఈ నెంబర్ ద్వారా 87126 99204 సమాచారం ఇవ్వాలని మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్ సుచించారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా గురువారం మంథని పట్టణంలోని మాత శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి, రేనే ఆసుపత్రి లో సిబ్బందికి, చికిత్స పొందుతున్న పేషంట్లకి మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కల్పించారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలలో అగ్ని మాపక నివారణ కరపత్రాలు పంచుతూ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యాలపై తగు సూచనలు ఇచ్చారు. మంటలు ఎగిసిపాడుతున్న సమయంలో ఏలా అదుపు చేయాలో ప్రమాదల బారిన పడకుండా తమను తాము ఏలా రక్షించు కోవాలి అనే అంశాలపై పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మన్ దేవేందర్, ఫైర్ మన్ నరేందర్, ప్రశాంత్, డ్రైవర్ ఆపరేటర్ రమేష్, నాగరాజు పాల్గొన్నారు

# కూకట్ పల్లిలో కాంగ్రెస్ నిరసన

**హైదరాబాద్** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం వారి సొంత లాభాపేక్షకు వాడుతూ ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెడుతుందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నేడు కూకట్ పల్లి నియోజకవర్గం వై జంక్షన్ వద్ద సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరై బిజెపి ప్రభుత్వంతోపాటు రంగ సంస్థ అయినా ఈ డి కి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి నేతలు రా హుల్ గాంధీ, సోనియా గాంధీ పేర్లను ఈ డీ చార్జ్షీట్ లో చేర్చుడంతో తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు నేడు ఈడి ఆఫీసుల ముందు నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో కూకట్ పల్లి కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
సిబిఐ, ఈడీలను కేంద్ర ప్రభుత్వం తమ జేబు సంస్థ ల్లా వాడుకుంటోందని, కేవలం ప్రతిపక్షాల పై అక్రమ కేసులు పెట్టేందుకే ఈడీని బిజెపి ఉపయోగించుకుంటుందని బండి రమేష్ మండిపడ్డారు.సోనియా, రాహుల్గాంధీలపై ఈడీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఎవరు ఎన్ని చేసినా ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని వారికి త్వరలోనే బుద్ధి చెబుతారని వారు వ్యాఖ్యానించారు.

# ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తత

**- కాంగ్రెస్కు వ్యతిరేకంగా బీజేవైఎం ఆందోళన**

**హైదరాబాద్** కాంగ్రెస్ నిరసనలకు కౌంటర్ గా బీజేపి యువ మోర్చ ఆందోళనలకు దిగింది. ట్యాంక్ బండ్ అంబెద్కర్ విగ్రహం దగ్గర అందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బీజేవైఎం నేతలను అడ్డుకున్నారు.
బీజేపీ, ఈడి లపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని బీజేవైఎం ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో తప్పులను కప్పిపుచ్చుకునేలా కాంగ్రెస్ తీరు అంటూ నినాదాలు చేసారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెల్ల మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ తీరు దొంగే దొంగ అన్నట్లు ఉంది. ఈడిని కాంగ్రెస్ తప్పు పట్టడం బాధాకరం. రాజ్యాంగానికి కాంగ్రెస్ మోకరిల్లాల్సిందే. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, వాద్రా ఆస్తులను జప్తు చేయాలని అన్నారు.

# షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో భూభారతి 2025 చట్టంపై భారీ అవగాహన సదస్సు

**షాద్ నగర్** షాద్ నగర్ ఆర్డీఓ ఎన్ఆర్ సరిత ఆధ్వర్యంలో భూభారతి 2025 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహణ. భూ భారతితో భూముల హక్కులు భద్రం. భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పష్టీకరణ. సదస్సుకు హాజరైన ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు, నాయకులు, మీడియా ప్రతినిధులు. వాయిస్ ఓవర్.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి-2025 చట్టంతో రైతుల భూముల హక్కులు భద్రంగా ఉంటాయని, రైతుల మేలు కోసం భూ సమస్యల సత్వర పరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో స్థానిక ఆర్డిఓ ఎన్ఆర్ సరిత ఆధ్వర్యంలో జరిగిన భూభారతి చట్టం 2025 అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గం లోని ఆయా మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు, సబ్ రిజిస్టర్ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు నాయకులు మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అవగాహన సదస్సును ఉద్దేశించి కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టంపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టంలోని ముఖ్యంశాలను కలెక్టర్ వివరించారు. ఏవైన సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. న్యాయ సేవ సంస్థలు, ఇతర సంస్థలు, వ్యవస్థల ద్వారా పేదలకు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి, మహిళలకు ఉచిత న్యాయసహాయం, సలహాలు ఈ చట్టం ద్వారా అందించాలన్నారు. ముఖ్యంగా తహసీల్దార్లు చట్టంలోని ప్రతీ అంశంపై అవగాహన సాధించాలన్నారు. మ్యూటెషన్లు, జారీ చేసిన పాస్పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో లేదా కలెక్టర్కు అప్పీలు చేసుకునేలా రెండు అంచెల అప్పీలు వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. వారసత్వంగా సంక్రమించే భూముల మ్యుటేషన్ల విషయంలో నోటీసులు జారీ చేయాల్సిన ప్రక్రియపై సూచనలు చేశారు.

# గంభీరావుపేటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ తోపులాట

**రాజన్న సిరిసిల్ల** గంభీరావుపేట లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కాంగ్రెస్ బిఆర్ఎస్ కార్యకర్తల తోపులాట జరిగింది. ఘర్షణ వాతావరణం ఏర్పడడంతో పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే కేటిఆర్ ఫోటో పెట్టలేదని బిఆర్ఎస్ శ్రేణులు అధికారులను నిలదీసారు. ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్ నాయకుడిని నెట్టేయడంతో వాగ్వివాదం జరిగింది. ఘర్షణ వాతావరణంతో తోపులాట జరిగింది. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

## బీర్కూరు, నస్రుల్లాబాద్ మండలాల్లో

# కల్తీ కల్లు కలకలం

**- కల్లు దుకాణాలు తెరవండి సారూ**

**కామారెడ్డి** జిల్లాలోని బీర్కూరు, నస్రుల్లాబాద్ మండలాల్లో కల్తీ కల్లు కలకలం కొనసాగుతోంది. కల్లులేక ఇబ్బందులు పడుతున్నామంటూ పలు గ్రామాల్లో ఆందోళనలు జరుగుతన్నాయి. బాధితులు ఇటీవల కల్తీకల్లు బారిన పడి హాస్పిటల్ పాలైయారు. దాంతో కల్తీ కల్లును ఎక్సైజ్ అధికారులు కట్టడి చేసారు. కల్లు అందుబాటులో లేకపోవడంతో సైడ్ ఎఫెక్ట్స్ వచ్చాయి. కల్లు తాగకపోవడంతో మల్లాపూర్ గ్రామస్తులు వింత, వింతగా ప్రవర్తిస్తున్నారు. విచిత్ర చేష్టలు చేస్తుండంతో కుటుంబ సభ్యులు.ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లు దుకాణాలను పునరుద్ధరించాలంటూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# కుత్బుల్లాపూర్లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**మేడ్చల్** కుత్బుల్లాపూర్ లోని గండిమైసమ్మ తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఎంఎల్ సి శంభీపూర్ రాజు,ఎంఎల్ఏ వివేకానంద,ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు హజరయ్యారు.

ఈనెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ (రజతోత్సవసభ) బహిరంగసభ విజయవంతం చేసేందుకు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పార్టీనేతలతో గండిమైసమ్మ మేడ్చల్ జిల్లా (బిఆర్ఎస్ పార్టీ) కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది.

# అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం చూపించవద్దు

**విశాఖపట్నం** అగ్నిప్రమాదాలపై ఎలాంటి నిర్లక్ష్యం చూపించొద్దని విశాఖలో అగ్నిమాపకసిబ్బంది సూచిస్తున్నారు.అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రామ్ నగర్ లో అదికారులు,సిబ్బంది ఓ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకునే చర్యల పట్ల అవగాహన కల్పించారు.అగ్ని ప్రమాదాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. తమకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తే వెంటనే నిమిషాల్లో మీ ముందు ఉంటామని సిబ్బంది పేర్కొన్నారు.అనంతరం అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయో వాటిని నివారించే పద్దతులపై అవగాహన కల్పించారు.

## బ్రహ్మోత్సవాలకు సహకరించిన

# అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు

**- శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు...**

**జమ్మికుంట** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, అపర భద్రాద్రిగా పిలిచే ఈ క్షేత్రంలో 2025 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4వ తేదీ నుండి 16వ తేదీ వరకు 13 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ 13రోజులు కార్యక్రమాల్లో వేల మంది భక్తులు స్వామివార్లను దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావడం సంతోషంగా ఉందని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన చైర్మన్ ఇంగిలె రామారావు, అన్నారు. ఈ 13 రోజులు ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం రోజు మరియు పెద్ద వ్రతం రోజు కలుపుకొని సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారి దర్శనానికి హాజరు కావడం జరిగిందని . భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ మరియు ధర్మకర్తల మండలి తరపున అన్ని ఏర్పాట్లు చేశామని . ధర్మకర్తల మండలి మరియు దేవస్థాన అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని . మాకు సహకరించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అన్నదానం ఏర్పాటు చేశారని . కార్యనిర్వాహణాధికారి, ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది,వారికి మరియు వివిధ ప్రభుత్వ శాఖలు పోలీస్ ,రెవెన్యూ, మున్సిపల్ ,హెల్త్ డిపార్ట్మెంట్, ఆర్ డబ్ల్యూ ఎస్,,ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పారిశుద్ధ కార్మికులు విద్యుత్ శాఖ మంచినీరు సప్లై, ఫైర్ సిబ్బంది, మజ్జిగ పంపిణీ చేసిన వారు, సేవా సమితి మహిళలకు, ప్రతి ప్రభుత్వ విభాగాల వారు తమ యొక్క సిబ్బందితో భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఉత్సవాలను విజయవంతం కావడానికి ప్రత్యేకంగా సహకరించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు మండల ప్రజలకు దేవస్థానం యొక్క అధికారుల సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కృప ఉండాలని ఈ యొక్క కార్యక్రమాన్ని ఇంత విజయవంతం చేసిన భగవత్ భక్తులకు మరియు మా ధర్మకర్తల మండలికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేశ్వర్,రవికిరణ్, గోపాల్ రెడ్డి, ,మలేష్, కిషన్ రెడ్డి, లావణ్యశ్రీనివాస్ ,చిరంజీవి,రామ్ రెడ్డి, నాగరాజు, మధుకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రాజేందర్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ప్రణవ్

**హుజురాబాద్ :** పేద కుటుంబంలో ఉండి పరిస్థుతులు బాగోలేక ఆసుపత్రుల పాలైన వారిని సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు వరసలో ఉంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 5 మండలాలు,2 పట్టణాలకు సంబంధించిన 183 లబ్దిదారులకు,76 లక్షల విలువచేసే చెక్కులను లబ్దిదారులకు స్వయంగా ప్రణవ్ అందజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ చెక్కులు వచ్చిన వెంటనే లబ్దిదారులకు అందజేస్తున్నామని, వారు వెంటనే బ్యాంక్ లో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిననాటినుండి 1,500 కోట్ల పై చిలుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని,అర్హులైన లబ్ధిదారులకు ఆదుకోవడంలో రాజకీయాలకతీతంగా ఉంటామని,సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో పార్టీ కార్యాలయానికి వచ్చిన వెంటనే అధికారులకు పంపించి చెక్కులు త్వరగా వచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

**- దళారులను నమ్మి మోసపోవద్దు**



**కమాన్ పూర్** రైతులు దళారులను నమ్మి మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని కమాన్ పూర్ వ్యవసాయ సహకార చైర్మన్ ఇనగంటి భాస్కరరావు సూచించారు. ఈ మేరకు వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో సిద్ది పల్లె , పెంచల పేట రొంపి కుంట నాగారం, గొల్లపల్లి గుండారం సుందిళ్ల చందనాపూర్ ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ సహకార పరమ సంఘం ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ తూకాల్లో మోసం జరుగకుండా డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేశాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటోంది. ధాన్యం డబ్బును బ్యాంకు ఖాతాలో వేయడంతో పాటు తూకాల్లో ఎలాంటి మోసాలు జరుగకుం డా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిని అన్నదాతలు అర్థం చేసుకుని ఐకేపీ, వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రతీ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను(తరలించేందుకు అయ్యే ఖర్చును తగ్గిచ్చేందుకు కృషి చేస్తోంది అన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. డిజిటల్ తూకం మిషన్, మద్దతు ధరతో పాటు సకాలంలో రైతులకు డబ్బులు అందిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు అమ్మకునేందుకు దళారులను ఆశ్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీనిని గమనించిన అధికారు లు, ప్రజా ప్రతినిధులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. . రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ నంబర్లను సేకరించి తేమ 17 శాతం వరకు ఉ ంటేనే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అకౌంట్లలో నాలుగైదు రోజుల్లో నగదు చేరేలా చర్యలు చేపడుతున్నామని భాస్కర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ వైనాల రాజు, సిద్ది పల్లె తాజా మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ జాబు సతీష్, నాయకులు గడ్డం శ్రీనివాస్, సూచన రవి, సిబ్బంది రవి, రాజు, సాబీర్, తో పాటు రైతులు పాల్గొన్నారు.

# సన్నవడ్లకు బోనస్తో రైతుల్లో సంబురం

**- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు.**



**కమాన్పూర్** సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇవ్వడం జరుగుతోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రామగిరి మండలంలో పలు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలు మేరకు రామగిరి మండలం బుధవారం పేట (రామయ్యపల్లి) లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం చేశారు. బుధవారం పేట (రామయ్య పల్లి)లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఫ్యాక్స్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు వైస్ చైర్మన్ ఎలువక కొమరయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రొడ్డ బాపన్న కలిసి తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్కకొమురయ్య గౌడ్ ప్రారంభించారు.!!!×
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతును రాజుగా చూసేందుకు తమ ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ లాంటి తదితర పథకాలను అమలు చేసి రైతుల్లో భరోసా నింపుతుందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాళ్కు 4కిలోల కోత విధించిందని, తమ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యంలో గింజ కటింగ్ లేకుండా ధాన్యం డబ్బులు చెల్లింపు చేయడం జరిగిందని అన్నారు. రైతులకు ధాన్యం అమ్ముకోవడంలో ఇబ్బంది కలగకుండా ఎక్కడ అవసరమైతే అక్కడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్ధార్థి బుచ్చయ్య, దేవునూరి రజిత శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మొగిలి నరేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బావు రాయమల్లు, కత్తెరసాల, దేవునూరి రాజేష్ శంకేసి మల్లయ్య, రాజయ్య, బావు సది, కాటిపల్లి శంకర్, ఎదునూరి గట్టయ్య, లింగన్నపేట శంకరయ్య, కన్నూరి శ్రావణ్,వివేక్,గట్టయ్య, సంతోష్, కొత్త శీను, కర్ణాకర్ శ్రీను,రాయమల్లు గ్రామస్తులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,రైతులు, హమాలీలు,తదితరులు పాల్గొన్నారు.

# వీడని తల్లి కూతుర్ల మృతి



మిర్యాలగూడ మిర్యాలగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత శనివారం తల్లి, కూతుళ్ళ మృతిపై మిస్టరీ వీడలేదు. పోలీసులకు సవాల్ గా తల్లి కూతురు మిస్టరీ డెత్ కేసు మారింది. మృతురాలి భర్త సీతారాం రెడ్డి.. ఊర్లో లేకపోవడం, గడియ పెట్టుకొని బెడ్ రూమ్ లో తల్లి రాజేశ్వరి ఆత్మహత్యకు పాల్పడింది. రాజేశ్వరి ఎడమ చేయి మనికట్టు, పాదాల వద్ద కత్తి గాయాలు వున్నాయి. చిన్న కూతురు వేద సాయిశ్రీ గొంతుపై పదునైన కత్తిగాటు వుంది. తండ్రి వచ్చి డోర్ కొట్టినప్పుడు పెద్దకూతురు వేదశ్రీ మెలుకువగానే ఉంది. తల్లి, కూతురు మిస్టరీ డెత్ పై అనేక అనుమానాలు వున్నాయి. ఇంట్లో ఘర్షణ జరిగినట్లుగా, కుర్చీలు, ఇంట్లోని సామాన్లు చెల్లాచెదురుగా పడివున్నాయి. ఇంట్లో ప్రెగ్నెన్సీ టెస్ట్ స్ట్రిప్స్ దొరికాయి. మామయ్య మరో పెళ్లి చేసుకుని సంతోషంగా ఉండు.." అని పోలీసులకు లభించిన సూసైడ్ లెటర్ లో వుంది. మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో పోలీసుల విచారణ జరుగుతోంది. వేదశ్రీ నోరు విప్పితేనే రాజేశ్వరి, వేద సాయిశ్రీ మృతి కారణాలు తెలిసే అవకాశం వుంది. శుక్రవారం రాత్రి నిద్ర పోయి, శనివారం మధ్యాహ్నం మెలుకువ వచ్చిందని పెద్ద కూతురు వేదశ్రీ అంటోంది. వారిపై మత్తు పదార్థాల ప్రయోగం జరిగిందా..? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు..

# నేరాల్లో అధిక శాతం యువకులే వుంటున్నారు

**విశాఖపట్నం** ప్రేమ అనే ముసుగులో యువత బలైపోతున్నారని,ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలు అవుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో మహిళ రక్షణకు కలసికట్టుగా కార్యక్రమం నిర్వహిస్తామని,మహిళ రక్షణకు కలిసికట్టుగా కార్యక్రమానికి విశాఖలో శ్రీకారం చుట్టామని,స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలని,మన కోసం నిరంతరం కష్టపడుతున్న తల్లిదండ్రులు కోసం ఒక్క క్షణం ఆలోచన చేయాలని,ఫోక్సో కేసులలో 20 శాతం నిందితులు 18 సంవత్సరాలు లోపే వారే ఉంటున్నారని,80 శాతం మంది నిందితులు 23 సంవత్సరాలు లోపు వారే ఉంటున్నారని అన్నారు. గంజాయి యువత భవిష్యత్ ను నాశనం చేస్తుందని చెప్పారు.

## రాష్ట్ర మానవ హక్కుల
# కమిషన్ ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ గా జస్టిస్ షమీమ్ అఖ్తర్, సభ్యులుగా శివాది ప్రవీణ, నాన్ జ్యుడిషియల్ సభ్యుడిగా రిటైర్డ్ ఐఏఎస్ డా. బి కిషోర్ గురువారం నాడు కమిషన్ ప్రాంగణంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## ఆర్ హెచ్ వి ఎస్ జిల్లా అధ్యక్షులుగా
# సుందర కుమార్

- మే 14 నుంచి 26 వరకు బద్రీనాథ్ లో సరస్వతీ పుష్కరాలు
- త్వరలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయం తిరుపతిలో ప్రారంభం



**తిరుపతి :** రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ( ఆర్ హెచ్ వి ఎస్ ) జిల్లా అధ్యక్షులుగా కీర్తిపాటి సుందర్ కుమార్ ను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు తెలిపారు. గురువారం స్థానిక మన తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అయోధ్య ప్రధాన కేంద్రంగా ఏర్పాటైన రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ముఖ్య సంరక్షకులు మహంతు వైదేహి వల్లభ శరన్ దాస్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్ చంద్ర శుక్ల లచే నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. హిందూ సామ్రాజ్యం లో రామ రాజ్య స్థాపన కోసం, సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరాలనే సంకల్పంతో శ్రీవారి పాదాల చెంత తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్రను ఈ ఏడాదిలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రామ రాజ్య స్థాపనే ఎజెండాగా ఏర్పాటైన ఆర్ హెచ్ వి ఎస్ వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ నెలలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభమై అయోధ్య వరకు కొనసాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూపీ ముఖ్యమంత్రి వర్యులు యోగి ఆదిత్యనాథ్ లతోపాటు శ్రీలంక, మారిషస్ ప్రధానులు, నేపాల్ కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపీ అనిత దేవి సాహూ,తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉపసభాపతి రఘురామకృష్ణమ రాజు ( ఆర్ ఆర్ ఆర్) ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ మాట్లాడుతూ హైందవ ధర్మం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం, శ్రీరామ రాజ్య స్థాపన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ మహా యజ్ఞంలో తమకు భాగస్వామ్యం కలగడం దైవ సంకల్పంగా భావిస్తూ తమ వంతు శక్తివంచన లేకుండా ఆర్ హెచ్ వి ఎస్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ హెచ్ వి ఎస్ ఆధ్వర్యంలో సీతా సమేత శ్రీరామ సేవకులను అతి త్వరలో నియమించనున్నట్లు గిరి రాజు తెలిపారు. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్ర విజయవంతా నికి ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధం గా వ్యవహరించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ బాధ్యులు కృష్ణ కిషోర్, రాష్ట్ర అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు,ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, టీటీడీ కాంట్రాక్టర్ గిరిరాజు లకు అభినందనలు తెలియజేశారు.

## ఈ డి కార్యాలయం వద్ద
# టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

**హైదరాబాద్** నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ గార్ల ను ఛార్జ్ షీట్ లో చేర్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ నేతలు ధర్నాకు దిగారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. . ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావ్, ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బలమురి వెంకట్, ఎమ్మెల్యేలు శంకరయ్య, రాజ్ ఠాగూర్ కార్పొరేషన్ ఛైర్మన్ లు, నాయకులు తదితరులు పాల్గోన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ ఫాసిస్టు పాలన. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఇమేజ్ ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపింది. తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియాలని ధర్నా చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ పెపర్ అయిన నేషనల్ హెరాల్డ్ పేపరు కి 90 కోట్లు రుణం ఇస్తే మనిలాండరింగ్ జరిగినట్లు. ఎలా అవుతుంది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు పెట్టారు. మనిలాండరింగ్ కేసు కక్ష్య సాధింపు చర్యే . మోదీ హవా తగ్గుతున్న క్రమంలో రాహుల్ గాంధీ ఇమేజ్ ను బద్నాం చేసేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు.

గాంధీ కుటుంబం ఏనాడూ కేసులకు భయపడింది లేదు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నవారు బీజేపీ పార్టీలో ఒక్కరూ లేరు. మోడీకి కనువిప్పు కలిగేలా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఒక ఫైటర్. దేశ ప్రజా గొంతుక రాహుల్ గాంధీ. రాహుల్ సంకల్పం ముందు ఈ కుట్రలు, అక్రమ కేసులు బలాదూర్. కుల గణన తో రాహుల్ గాంధీ మోడీకి రాజకీయ మరణ శాసనం రాశారు. బీహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ , సోనియా గాంధీ పై అక్రమ కేసులు పెట్టారు. ఎన్నికలు రాగానే ప్రతి పక్షాలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వాడడం మోదీ – అమిత్ షాకి అలవాటుగా మారింది. గుజరాత్ లో ఏఐసిసి సమావేశాలతో బీజేపీ నేతల్లో వణుకు మొదలైంది. దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు అసమనమైనవని అన్నారు.

## జవహర్ నగర్‌లో మాజీ మంత్రి
# మల్లారెడ్డి సుడిగాలి పర్యటన



**మేడ్చల్** ఈనెల 27న వరంగల్ లో జరగబోయే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు కార్యకర్తలు కదిలి రావాలని మాజీ మంత్రి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నాడు మల్లారెడ్డి బైక్ పై తిరుగుతూ పార్టీ వర్గాల్లో ఉషారు నింపారు. మాజీ మేయర్ మేకల కావ్య తో కలిసి ఇల్లిల్లూ తిరుగుతూ ప్రజలకు బొట్టు పెట్టి కరపత్రాలని పంచుతూ బహిరంగ సభకు ఆహ్వానించారు. అనంతరం మాజీ మేయర్ మేకల కావ్య ఇంటిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాషవోని కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ లు, ఆలూరి సంగీత, మేక లలిత యాదవ్, మునిగాల సతీష్ , జిట్టా శ్రీవాణి జిల్లా నాయకులు ఆలూరి రాజశేఖర్ తో పాటు నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, పెద్దయెత్తున ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..
# ఏడుగురికి గాయాలు







**ఏలూరు** జంగారెడ్డిగూడెం మండలం తాడువాయు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పరిసర ప్రాంతాల నుండి భక్తులు భద్రాచలం వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏడుగురికి గాయాలు అయ్యాయి. గాయపడినివారిని చికిత్స నిమిత్త జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. బాధితులంతా తాడేపల్లిగూడెం శశి కాలేజీలో చదువున్న విద్యార్థులు. పరీక్షలలో పాసైన సందర్భంగా భద్రాచలం వెళుతున్నట్లు యువకులు తెలిపారు.యువకులంతా కారు లో వేగంగా వేళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## పోలవరం ప్రాజెక్టులో రెండో రోజు
# కొనసాగిన మట్టి నాణ్యత పరీక్షలు

- పాల్గొన్న కేంద్ర బృందం సభ్యులు, జలవనరుల శాఖ అధికారులు



**పోలవరం :** పోలవరం ప్రాజెక్టు పరిధిలో మట్టి నాణ్యత పరీక్షలు రెండో రోజు గురువారం కూడా కేంద్ర నిపుణుల బృందం చేసింది. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి. సిద్దార్థ్ హెడావో, విపుల్ కుమార్ గుప్తా, జలవనరుల శాఖ అధికారి నిర్మల తదితరులు రెండోరోజు దండంగి, పోలవరం జల విద్యుత్ కేంద్రం పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టిని స్థానికంగా లేబరేటరీలో పరీక్షించడం తో పాటు, మరింత సూక్ష్మంగా తమ కేంద్ర కార్యాలయం లో పరీక్షించేందుకు సేకరించారు. స్థానికంగా, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ లో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టులో అవసరమైన ప్రాంతాల్లో అవసరమైన మేర ఈ మట్టిని వినియోగిస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. మట్టి నాణ్యతా పరీక్షల్లో జలవనరుల శాఖ డీఈ వి.నిర్మల, ఈఈ డి శ్రీనివాసులు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## షామీర్ పేట పోలీస్ స్టేషన్‌లో
# అగోరిపై జోగిని సంధ్య ఫిర్యాదు

**మేడ్చల్** అగోరి పేరు చెప్పుకొని ప్రజలను మోసం చేస్తున్న అగోరి అలియాస్ శ్రీనివాస్ అలియాస్ శివ విష్ణు బ్రహ్మ అల్లూరిపై చర్యలు తీసుకోవాలని జోగిని సంధ్య గురువారం శామిర్పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జోగిని సంధ్య మాట్లాడుతూ సనాతన ధర్మం పేరు చెప్పుకొని ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, హిజ్రాలకు చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అతడు అగోరి కాదని, అసలు హిజ్రానే కాదన్నారు. ఇప్పటికే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకొని వదిలిపెట్టాడని, తాజాగా వర్షిని అని అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని అన్నారు.

దీంతో అతడి బండారం బయటపడిందని, ప్రభుత్వము, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం కాపాడాలంటే ఇలాంటి వాళ్లను సమాజం నుంచి తరిమి కొట్టాలని, బయట ఎక్కడా తిరగనివ్వద్దని ప్రజలకు సంధ్య విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన అతడిని శిక్షించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. నేను మొదటి నుంచి అగోరి అలియాస్ శ్రీనివాస్ పై పోరాటం చేస్తున్నానని, కత్తులతో దాడి చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మనం తెచ్చుకున్నామన్నారు. షామిర్పేట పోలీసులు ఫిర్యాదు తీసుకొని, కేసు నమోదు చేశారని తెలిపారు. త్వరలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సంధ్య తెలిపారు.

# పల్లకిలో.. భద్రేశ్వరుడు..!

- శోభాయమానంగా ఊరేగింపు - విరజిమ్మిన దివ్వెల వెలుగులు

**వికారాబాద్** తాండూరు పట్టణ నడిబొడ్డున వెలసిన శ్రీ భావిగి భద్రేశ్వరుని బ్రహ్మోత్సవాలు మనోరంజకంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న స్వామివారి పల్లకిసేవ కార్యక్రమాలు కన్నుల పండుగలా కొనసాగుతున్నాయి.9 రోజుల పాటు జరిగే ఉత్సవలలో

భాగంగా బుదవారం రాత్రి స్వామి వారిని ప్రత్యేక అలంకరణతో ముస్తాబైన స్వామి వారిని పల్లకిలో ఉంచగా ఆలయం నుంచి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో వెలగించిన టపాసుల వెలుగులు విరజిమ్మాయి. ఆతరువాత పురవీదుల్లో భద్రేశ్వరుని పల్లకిసేవ వెలుగులతో పల్లకిసేవ కొత్త శోభను తీసుకవచ్చాయి. పల్లకిసేవ ముందు భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి ప్రారంభమైన పల్లకిసేవ రాచన్న దేవాలయం వరకు కొనసాగి అక్కడి నుంచి తిరిగి ఆలయానికి చేరుకుంది. పల్లకిసేవ ఊరేగింపులో ఆలయ రెనవేషన్ కమిటి ఛైర్మన్ పటేల్ కిరణ్ కుమార్, ఈఓ శేఖర్ గౌడ్, వీరశైవ సమాజం సభ్యులు, యువదళ్ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు జాతర ఉత్సవాల్లో పురస్కరించుకొని ఈనెల 19 వ తేదీన భారీ రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు.

# పరిశ్రమలో అగ్ని ప్రమాదం

**పటాన్ చెరు** పటాన్ చెరు పాశ మైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలోని పాశ మైలారం వెంకర్ కెమికల్ కంపెనీ లో అగ్ని ప్రమాదం సంభవించింది. రియాక్టర్ నుండి మరొక రియాక్టర్ లోకి కెమికల్ పంపించే క్రమంలో మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన పరిశ్రమ కార్మికులు, సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైర్ ఇంజన్ల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు ప్రమాద స్థలంలో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది అగ్ని ప్రమాదంలో రియాక్టర్లు పేలడంతో పరిశ్రమ యాజమాన్యానికి కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు

# డాక్యుమెంట్ రైటర్ల నిరసన

రంగా రెడ్డి స్లాట్ బుకింగ్ ఆన్లైన్ చేయకుండా పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ బుకింగ్ పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు ధరలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆన్లైన్ స్లాట్ బుకింగ్ నూతన విధానం వల్ల డాక్యుమెంట్ రైటర్ లు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ బుకింగ్ కొనసాగించాలని కోరారు...

# ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలి.. పబ్బతి

- ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలి.. వై.డి.ఆర్ స్వామి
- కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి.. - నైట్ అవుట్ అలవెన్స్ రూ.400 ఇవ్వాలి
- ఆర్టీసీ డిపో ముందు ఎన్ఎంయు కార్మికుల నిరసన




**నందికొట్కూరు** రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల అక్రమ సస్పెన్షన్లు , అక్రమ రిమూవల్స్ ను వెంటనే ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్, ఆర్టీసీ డిపో సెక్రెటరీ వై డి ఆర్ స్వామి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నందికొట్కూరు ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు, వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్ ఆధ్వర్యం లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 యధావిధిగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి 300 నుండి 400 వరకు పాత పద్ధతిలో ఇవ్వాలన్నారు. గ్యారేజీ కార్మికులకు పనిష్మెంట్లు తగ్గించాలన్నారు. డిపోలో సస్పెన్షన్ లు ఎత్తివేయాలి అన్నారు . నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్ లు వెంటనే కార్మికుల కు ఇవ్వాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ గవర్నమెంట్ వారు ఇచ్చిన సిక్కులకు జీతాలు ఇవ్వాల న్నారు.మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అనారోగ్య సేవలకు పూర్తి జీతం చెల్లించాల న్నారు. ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో ప్రభు దాస్, రత్నం ,జనార్ధన్ , కుమార్ , విజయుడు, గ్యారేజీ సెక్రెటరీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ తరగతి గదులు
# ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్** కాశ్మీర్ గడ్డ లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్మార్ట్ డిజిటల్ తరగతి గదులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ పాఠాల ద్వారా విద్యాబోధనతో విద్యార్థులకు త్వరగా అవగాహన వస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు మెళకువలతో పాఠాలను బోధించాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, జిమ్నాస్టిక్స్, కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చదువు, ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు హసీనా ఫాతిమా పాల్గొన్నారు.

## మంథని తహసిల్దార్‌గా
# కుమారస్వామి బాధ్యతల స్వీకరణ




**మంథని** మంథని తహసిల్దార్ గా బదిలీపై వచ్చిన జీ. కుమారస్వామి గురువారం మంథని తహసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. రామగుండం తహసిల్దార్ గా పనిచేస్తున్న కుమారస్వామి ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో తహసిల్దార్ గా విధులు నిర్వహించిన రాజయ్య ను పెద్దపల్లికి బదిలీ చేయగా, పెద్దపల్లి తహసిల్దార్ రాజ్ కుమార్ ను మంథనికి కలెక్టర్ బదిలీ చేశారు. రాజ్ కుమార్ విధుల్లో చేరకపోవడంతో గత కొన్ని రోజులుగా మంథని నాయబ్ తహసిల్దార్ సిరిపురం గిరి ఇంచార్జ్ తహసిల్దారుగా బాధ్యతలు నిర్వహించారు. మంథని తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామిని డిప్యూటీ తహసిల్దార్ సిరిపురం గిరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు అనిల్ రెడ్డి, సదయ్య ఇతర కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సురేష్ హత్య కేసులో నిందితుల అరెస్టు

**నల్గొండ:** నల్గొండలో సంచలనం సృష్టించిన మణికంఠ కలర్ ల్యాబ్ యజమాని సురేష్ హత్య కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐతో సహా నలుగురు నిందితులను నల్గొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఈ హత్యకు గల కారణాలను, నిందితుల వివరాలను మీడియాకు తెలియజేశారు. ఏప్రిల్ 11వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో నల్లగొండలోని రామగిరి ప్రాంతంలోని గీతాంజలి అపార్ట్మెంట్లో ఉన్న మణికంఠ కలర్ ల్యాబ్లో గడ్డపాటి సురేష్ దారుణ హత్యకు గురయ్యారు. ఫోటోలు ప్రింట్ కావాలని చెప్పి లోపలికి వెళ్లిన దుండగులు, సురేష్ను కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు. ఈ హత్య కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో ప్రధాన నిందితుడు రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ మాతా వెంకటయ్య, అతని కుమార్తె సంసారం నాశనం కావడానికి కారణం తన అల్లుడి అన్న గడ్డపాటి సురేషే నని వెంకటయ్య భావించాడు.దీంతో నరేష్ మామ మరియు నరేష్ భార్య గడ్డపాటి ఉమా మహేశ్వరితో కలిసి సురేష్ను హత్య చేయించాలని పథకం వేశాడు. ఇందుకోసం గతంలో ఏపీలో పనిచేసి రిటైర్డ్ అయిన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సైకి చెందిన చిక్కు కిరణ్ కుమార్ ఏ అ.జ. కుమార్ మరియు అతని తమ్ముడు ముషం జగదీష్ను సుపారీ ఇచ్చాడు. మాతరి వెంకటయ్య అల్లుడు నరేష్ మరో స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయని పోలీసులు ధ్రువీకరించారు.. దీనికి కారణం నరేష్ అన్న అయిన సురేష్ నని వెంకటయ్య నమ్మాడు. సురేష్ను అంతమొందిస్తే తన అల్లుడు మారుతాడని దురాలోచనతో కిరణ్ కుమార్ను సంప్రదించాడు. సురేష్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకున్న వెంకటయ్య, ఉమా మహేశ్వరి ఇద్దరూ కలిసి సురేష్ను హత్య చేయించాలని నిర్ణయించుకున్నారు. కిరణ్ కుమార్ రూ. 15 లక్షలకు సుపారీకి ఒప్పుకొని రూ. 2 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నాడు. తన పథకంలో భాగంగా కిరణ్ కుమార్ తన బంధువు జగదీష్ను రూ. 3 లక్షలకు ఒప్పించి హత్యలో భాగస్వామిని చేశాడు. నెల రోజులుగా నిందితులు నల్లగొండలో సురేష్ కదలికలపై నిఘా ఉంచారు. ఏప్రిల్ 11వ తేదీ చెరువుగట్టు వద్ద జగదీష్తో కలిసి రాత్రి 10:20 గంటలకు సురేష్ కలర్ ల్యాబ్కు చేరుకున్నారు. ఫోటోలు ప్రింట్ కావాలని అడగగా, సురేష్ రేపు రమ్మనడంతో అడ్వాన్స్ కావాలని మాటల్లో పెట్టి పనిలో నిమగ్నమవ్వగానే అతనిపై కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం బైక్పై చెరువుగట్టుకు వెళ్లి రక్తపు మరకలున్న బట్టలు, కత్తులు కారులో పెట్టుకుని మూసి వాగు సమీపంలో పడేసి హైదరాబాద్ పారిపోయారు. ఈ కేసును నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ 2 టౌన్ సీఐ రాఘవరావు, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, నల్లగొండ 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి మరియు సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి త్వరితగతిన ఛేదించారు. జిల్లా ఎస్పీ ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు.

## ఎంపీల్లో చామల ఫస్ట్...

# రఘువీర్ లాస్ట్

**నల్గొండ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సమావేశాలు కీలకమైనవి. ఇవి చట్టాలను రూపొందించడానికి, ప్రభుత్వం జవాబుదారీతనాన్ని కలిగి ఉండటానికి, ప్రజల సమస్యలను చర్చించటానికి పార్లమెంట్ ముఖ్య వేదిక. పార్లమెంట్ సమావేశాలలో దేశంలోని ముఖ్యమైన సమస్యలు, సామాజిక అంశాలు, ఆర్థిక పరిస్థితులు, ఇతర జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై సభ్యుల మధ్య చర్చలు జరుగుతాయి.

దీని ద్వారా ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రభుత్వ విధానాలు, చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. పార్లమెంట్ సభ్యులు సభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనటంతో పాటు చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం వంటి ముఖ్యమైన విధులను నిర్వర్తించడం చాలా ముఖ్యం.తెలంగాణ నుంచి 17 మంది ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలు, బీజేపీ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఒకరు ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలకు తెలంగాణ ఎంపీల హాజరు శాతం, అడిగిన ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనటంపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. జూన్ 2024 నుంచి 4 ఏప్రిల్ 2025 మధ్య పార్లమెంట్ సమావేశాలకు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి 100 శాతం హాజరయ్యారు.ఆ తర్వాత బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి 95 శాతం హాజరు నమోదు చేశారు. మరో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అత్యధికంగా 80 ప్రశ్నలు వేసి 91 శాతం సమావేశాలకు హాజరయ్యారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చర్చల్లో టాప్లో ఉన్నారు. ఆయన 21 చర్చల్లో పాల్గొన్నారు. నల్గొండ ఎంపీ రఘువీర్ అతి తక్కువ హాజరుతో పాటుగా.. తక్కువ ప్రశ్నలు, చర్చల్లో పాల్గొన్నారు.

తెలంగాణ ఎంపీల హాజరు శాతం, అడిగిన ప్రశ్నలు, పాల్గొన్న చర్చలు ఇలా.. చామల కిరణ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్): 79 ప్రశ్నలు, 100 శాతం హాజరు, 17 చర్చలు రఘునందన్ రావు (బీజెపీ)– 46 ప్రశ్నలు, 97.05 శాతం హాజరు, 7 చర్చలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బీజేపీ)– 18 ప్రశ్నలు, 95.58 శాతం హాజరు, 6 చర్చలు అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం): 54 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 21 చర్చలు మల్లు రవి (కాంగ్రెస్): 28 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 10 చర్చలు గోడం నగేష్ (బీజేపీ)– 40 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 4 చర్చలు ఈటల రాజేందర్ (బీజేపీ) –80 ప్రశ్నలు 91.17 శాతం హాజరు, 9 చర్చలు వంశీ కృష్ణ ( కాంగ్రెస్)– 31 ప్రశ్నలు, 89.70 శాతం హాజరు, 7 చర్చలు డి.కె. అరుణ (బీజెపి)– 73 ప్రశ్నలు 88.23 శాతం హాజరు, 14 చర్చలు అరవింద్ ధర్మపురి (బీజేపీ)– 59 ప్రశ్నలు, 88.23 శాతం హాజరు, 2 చర్చలు సురేష్ షెట్కార్ (కాంగ్రెస్) 62 ప్రశ్నలు, 86.76 శాతం హాజరు , 5 చర్చలు రఘురామ్ రెడ్డి (కాంగ్రెస్)– 56 ప్రశ్నలు, 85.29 శాతం హాజరు, 9 చర్చలు కడియం కావ్య (కాంగ్రెస్)– 31 ప్రశ్నలు, 83.82 శాతం హాజరు, 5 చర్చలు బలరాం నాయక్ (కాంగ్రెస్)– 13 ప్రశ్నలు, 72.05 శాతం హాజరు, 3 చర్చలు కుందూరు రఘువీర్ (కాంగ్రెస్)– 8 ప్రశ్నలు, 72.05 శాతం హాజరు, 0 చర్చలు

# మేము మంత్రులమే...

## – వాళ్లకు, మాకు తేడా ఏంటీ...

**కరీంనగర్ :** తెలంగాణ మంత్రుల్లో హెలికాప్టర్ ఉపయోగించే విషయంలో భేదాభిప్రాయాలు వచ్చినట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. హైదరాబాద్కు దూరంగా ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు మంత్రులు హెలికాప్టర్ ఉపయోగిస్తున్నారు. అయితే కొంత మంది మంత్రులు మాత్రమే హెలికాప్టర్ ఉపయోగిస్తుండటం, మరికొందరికి హెలికాప్టర్ అందుబాటులో ఉండకపోవడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.సాధారణంగా ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి ప్రభుత్వ హెలికాప్టర్ను ఉపయోగిస్తూ జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. సీఎం పర్యటన ఎక్కడా లేనప్పుడు, హెలికాప్టర్ ఖాళీగా ఉంటే మాత్రమే మంత్రులు దానిని ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ అలా ఒక్క మంత్రికే కాకుండా ఇద్దరు ముగ్గురు మంత్రులు, ఉన్నతాధికారులు హైదరాబాద్కు దూరంగా ఉండే జిల్లాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు హెలికాప్టర్ ను ఉపయోగించుకునే అవకాశం ఉందని..అందుకు ప్రత్యేకంగా నిబంధనలంటూ ఏమీ లేవని అధికారులు చెబుతున్నారు.అయితే కొన్ని కీలక శాఖలు నిర్వర్తిస్తున్న మంత్రులు తరుచూ హెలికాప్టర్ ను ఉపయోగిస్తున్నారు. దూర ప్రాంతాలకే కాదు దగ్గర్లో ఉన్న జిల్లాలకు కూడా అందులోనే వెళ్తున్నారన్న టాక్ సచివాలయవర్గాల్లో విన్పిస్తోంది. నలుగైదుగురు మంత్రులు మాత్రమే రెగ్యులర్ గా హెలికాప్టర్ ను ఉపయోగించుకోవడం, మిగతా మంత్రులకు ఆ అవకాశం రాకపోవడంతో వారంతా కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

ఓ మంత్రి ఐతే రంగారెడ్డి జిల్లా పర్యటనకు సైతం హెలికాప్టర్ ను వాడుతున్నారంటూ చర్చ నడుస్తోంది. కొంతమంది మంత్రులకు దూరంలో ఉన్న జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్లాల్సి వచ్చినా హెలికాప్టర్ ఇవ్వడం లేదని వాపోతున్నారట. పైగా నల్గొండ జిల్లా మంత్రులు మాత్రమే హెలికాప్టర్ వాడుతున్నారని.. అందులోను ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాత్రమే హెలికాప్టర్ను తెగ వాడేస్తున్నారని ఓ సీనియర్ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట.అంతే కాకుండా కొంతమంది మంత్రులు ప్రైవేట్ కార్యక్రమాలకు, విందులకు సైతం హెలికాప్టర్ను వాడుతున్నారనే టాక్ సైతం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఈ వ్యవహారం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తుందన్న అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో నల్గొండ మంత్రులకు మాత్రమే హెలికాప్టర్ భాగ్యం ఉందని తాజాగా మంత్రి దామోదర రాజనర్సింహ కామెంట్ చేయడంతో తెలంగాణ క్యాబినెట్లో మరోసారి గాలిమోటర్ రచ్చ మొదలైంది.అటు విపక్షాలు సైతం మంత్రుల హెలికాప్టర్ టూర్లపై విమర్శలు గుప్పిస్తున్నారు. కొంతమంది మంత్రులు హెలికాప్టర్ను పల్లె వెలుగు బస్సులా మార్చారంటూ విపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మరి ఈ గాలిమోటర్ రచ్చకు సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ స్టాప్ పెడతారా లేక ఇలాగే ఇష్యూ కంటిన్యూ అవుతుందా అనేది చూడాలి.

# భూభారతి వర్సెస్ ధరణి...

**హైదరాబాద్ :** ధరణిని బంగాళాఖాతంలో కలుపుతూ తెలంగాణలో సరికొత్తగా భూభారతి వచ్చేసింది. ఇన్నాళ్లు రైతుల సహనాన్ని పరీక్షించిన ధరణికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెల్లుచీటి పలికింది. భూ హక్కుల నిర్వహణలో నవ శకాన్ని మొదలు పెట్టింది. రైతుల భూముల హక్కులకు భద్రత, భరోసా ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం సరికొత్తగా తెచ్చిన భూభారతి చట్టం చాలా లెక్కలకు పరిష్కారంగా వచ్చింది. ఉన్నది ఉన్నట్లు.. లెక్కలు పక్కాగా, సమస్యలు తీర్చేలా భూభారతి ఉండబోతోంది. ఇంతకీఒక్కటేమిటి.. ఇలా ఎన్నెన్నో అవకాశాలను, పారదర్శకతను తీసుకొస్తూ తెలంగాణలో భూ భారతి వచ్చేసింది. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా కొత్త వ్యవస్థ వచ్చింది. ప్రతిదానికి కోర్టుల దాకా వెళ్లాల్సిన పని లేదు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ ఇలా స్టెప్ బై స్టెప్ పరిష్కార మార్గాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు, ఇతర లావాదేవీలన్నీ భూభారతి పోర్టల్ ద్వారానే జరగనున్నాయి.గతంలో ధరణి పోర్టల్ అమలులోకి వచ్చినప్పుడు తలెత్తిన సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతులకు అర్థమయ్యేలా 33 మాడ్యూల్స్ను 6కు కుదించి యూజర్ ఫ్రెండ్లీగా పోర్టల్ను రూపొందించారు. భూభారతి చట్టంలోని 23 అంశాలను దశలవారీగా అమలు చేయనున్నారు. మొదటి దశలో భూముల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన అంశాలను అమలు చేస్తారు.పోర్టల్ నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తుతున్నాయా అన్నది తెలుసుకునేందుకు నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాల్లో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద స్టడీ చేస్తోంది. భూభారతి పోర్టల్ ద్వారా రైతులు భూమి రిజిస్ట్రేషన్, యజమాని పేరు మార్పు, వివాదాలపై అప్పీల్, రికార్డ్ ఆఫ్ రైట్స్లో తప్పులు సరిచేయడం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడం వంటి పనులు చేసుకోవచ్చు.అంతేకాకుండా భూమికి సంబంధించిన ఇతర సమాచారం, నిషిద్ధ భూముల వివరాలు, సర్వే నంబర్ లేదా పట్టాదారు పాస్బుక్ నంబర్తో భూమి హక్కుల గురించి తెలుసుకోవచ్చు. భూమి మార్కెట్ విలువ, ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్, రిజిస్టర్డ్ పత్రాల సమాచారం, భూమి సంబంధిత ఫీజులు ఆన్లైన్లో చెల్లించే ఈ–చలాన్ సౌకర్యం కూడా ఈ పోర్టల్లో అందుబాటులో ఉంటుంది.హక్కుల రికార్డులో తప్పుల సవరణలతో పాటు అక్రమంగా పట్టాలైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు కొత్త ఖీఖీ చట్టం మోక్షం కల్పించబోతోంది. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఇంటి స్థలాలకు, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక హక్కుల రికార్డు అందుబాటులోకి రానున్నాయి. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు భూసమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థను తీసుకురానున్నారు.భూ రికార్డుల్లో కీలకమైంది, సమస్యాత్మకమైందేంటంటే.. హక్కుల రికార్డులు, తప్పొప్పుల సవరణలే. దీన్ని తాజా చట్టంలో ఈజీ చేశారు. భూరికార్డుల్లో తమ వివరాలు తప్పుగా నమోదైనవారు, భూమి వివరాలు నమోదుకానివారు భూభారతి పోర్టల్లో దరఖాస్తు చేసి, సవరించుకోవచ్చు. చట్టం అమల్లోకి వచ్చిననాటి నుంచి ఏడాదిలోపు అప్లై చేసుకోవాలి. దరఖాస్తుదారు సెల్ఫ్ డిక్లరేషన్ తో పాటు పాస్ బుక్, టైటిల్ డీడ్, పహాణీ, ఇతర ఆధారాలను చూపాలి. అధికారులు ఆ భూమితో సంబంధం ఉన్నవారందరికీ నోటీసులు ఇస్తారు.ఎవరైనా వారంలో అభ్యంతరాలు రాతపూర్వకంగా అందించాలి. లేదంటే కేసు మెరిట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అభ్యంతరాలు వస్తే విచారణ చేపట్టి 60 రోజుల్లో పరిష్కరిస్తారు. అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల మీద నెక్ట్స్ తహసీల్దార్కు అప్పీల్ చేసుకోవచ్చు. అక్కడా న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, ఆపై కలెక్టర్కు అప్పీల్ చేసుకోవచ్చు. వారు 30 రోజుల వ్యవధిలో సమాధానం ఇవ్వాలి.హక్కుల నమోదు అధికారి ప్రతి గ్రామంలోని అన్ని భూముల వివరాలతో హక్కుల రికార్డు తయారు చేసి, భూభారతి పోర్టల్లో అందుబాటులో ఉంచాలి. ఆబాది, వ్యవసాయేతర భూముల కోసం ప్రత్యేక రిజిస్టర్ను గ్రామాల వారీగా తయారు చేసి భూభారతి పోర్టల్లో ఇచ్చిన ఫారంలో నమోదు చేయాలి. ఈ భూములపై సర్వే నిర్వహించి మ్యాప్ తయారు చేయాలి. ఇక వివాదాలు లేకుండా, ఆ భూమిపై పూర్తి హక్కులున్న వారికి తహసీల్దార్ తాత్కాలిక భూధార్ కార్డు జారీ చేస్తారు. తర్వాత సర్వే, మ్యాపింగ్ ప్రక్రియలు పూర్తి చేసి శాశ్వత భూధార్ కార్డు ఇస్తారు. ఇక హక్కుల వివరాలు అన్నీ సక్రమంగా ఉంటే.. దరఖాస్తు చేసుకున్నవారికి పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేస్తారు.భూముల క్రయవిక్రయదారులు భూ భారతి పోర్టల్లో స్లాట్బుక్ చేసుకుని.. వివరాలను నమోదు చేయాలి. స్లాట్ ఉన్న రోజున గిఫ్ట్ డీడ్, సేల్డీడ్, పాస్పుస్తకం, టైటిల్ డీడ్, సీసీఎల్ఏ ఇచ్చిన తేదీ నుంచి సర్వే మ్యాప్ తదితర అవసరమైన పత్రాలు అందజేయాలి. రిజిస్ట్రార్ అవన్నీ పరిశీలించి.. హక్కుల రికార్డులోని వివరాలతో సరిపోల్చుతారు. అన్నీ సక్రమంగా ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్ అయిపోతుంది.తహసీల్దార్ రికార్డులో కొనుగోలుదారు పేరు చేర్చుతారు. కొత్త పాస్ పుస్తకం ఇస్తారు. ఇవే కాదు.. రైతులకు ఉచిత న్యాయ సహాయం, పాస్ బుక్ లలో భూమి పటం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు ట్యాంపర్ చేస్తే రద్దు చేసే అధికారం, భూమి హక్కులు ఏ రూపంలో వచ్చినా మ్యుటేషన్ చేసే వెసులుబాటు, భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీలేట్ వ్యవస్థ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కు ముందు భూముల సర్వే ఇలాంటివెన్నో ఇప్పుడు భూభారతితో అందుబాటులోకి వచ్చాయి.కొత్త చట్టం ప్రకారం తప్పుల సవరణను ఎవరెవరు చేయాలనే దానిపై నిబంధనల్లో స్పష్టత ఇచ్చారు.

మిస్సయిన సర్వే నంబర్ల నమోదు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గుల సవరణ కోసం సదరు భూముల మార్కెట్ విలువ 5లక్షలలోపు ఉంటే ఆర్డీవో స్థాయి అధికారి, ఆపై ఉంటే కలెక్టర్ సవరణ చేయాలి. డిజిటల్ సైన్ మిస్సింగ్ను ఆర్డీవో స్థాయి అధికారి సవరించవచ్చు. ఆస్తి ఏ తరహాదో నిర్ణయించే అధికారం, సవరించే అధికారం, పట్టాలో ఖాతా నంబర్ సవరించే అధికారం కలెక్టర్కు మాత్రమే అప్పగించారు.పేరులో తప్పులు వస్తే సవరించేందుకు.. పట్టా భూమి అయితే ఆర్డీవో, అసైన్డ్ భూమి అయితే కలెక్టర్కు అధికారం ఉంటుంది. నిషేధిత జాబితాలో ఉండే భూముల విషయంలో కలెక్టర్కే అధికారం కల్పించారు. నాలా నుంచి వ్యవసాయ భూమిగా సవరణ చేసేందుకు.. చదరపు గజాల్లో విక్రయించే పార్ట్ ల్యాండ్స్ విషయంలో అధికారాలను ఆర్డీవోకు కల్పించారు.

## మంటలు పుట్టిస్తున్న కొత్త కామెంట్స్...

**మెదక్ ::** బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ హాట్ కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ పడిపోవాలని కొంతమంది కోరుకుంటున్నారా? మాకొద్దీ కాంగ్రెస్ సర్కార్ అని అంటున్నారా? ఎవరిని ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు? రేవంత్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవసరమైతే సాయం కూడా చేస్తామని ఆ కొందరు అంటున్నారా? మరో మూడున్నరేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగాలని గులాబీ బాస్ కేసీఆర్ కోరుకుంటుంటే.. ఇలాంటి సమయంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ తెలంగాణలో హాట్ టాపిక్ గా మారాయి?బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మంటలు రేపుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ సర్కార్ ను పడగొట్టడానికి అవసరమైతే తాము సాయం చేస్తామని బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు కోరుకుంటున్నారని ప్రభాకర్ రెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో చర్చనీయాంశంగా మారాయి.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటున్న ఆ బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఎవరని ఇటు ప్రభుత్వం పెద్దలు, అటు ప్రతిపక్షాలు కూడా ఆరా తీస్తున్నాయంట. మరో మూడున్నరేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగాలని కొద్దిరోజుల క్రితం కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సమయంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు చాలా ఇంట్రెస్టింగ్గా మారాయి.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలోని బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు విసుగు చెందుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో తీవ్ర కలకలమే రేపుతున్నాయి. ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న పారిశ్రామికవేత్తలు, బిల్డర్లు అవసరమైతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని.. అంతేకాదు వాటికయ్యే ఖర్చును కూడా తామే భరిస్తామని వారు తనతో చెప్పినట్లు తోగుట సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పెద్ద బాంబే పేల్చారు.తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అసంతృప్తి తీవ్రంగా ఉందన్నారు. పిల్లల నుండి పెద్దల వరకు ఏ ఒక్క వర్గం కూడా రేవంత్ సర్కార్ పట్ల సంతృప్తిగా లేరని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే దాని గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని.. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ హాట్ కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. ప్రభాకర్ రెడ్డి చెబుతున్నట్లు నిజంగానే బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అంత కోపంగా ఉన్నారా అన్న చర్చ రాజకీయవర్గాల్లో మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని, దానికి తోడు హైడ్రా వల్ల నిర్మాణ రంగం నీరుగారిపోయిందని వారు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఇదే సమయంలో పారిశ్రామిక రంగం సైతం చతికిలపడిపోయిందని, ప్రభుత్వానికి సరైన ఇండస్ట్రియల్ పాలసీ లేనందువల్ల పారిశ్రామికవేత్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే చర్చ జరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకునే కొత్త ప్రభాకర్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది.అయితే దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ పై మండిపడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అధికార దాహంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించిన మంత్రి.. తమ జోలికొస్తే మాత్రం తాట తీస్తామని హెచ్చరించారు. కొత్త ప్రభాకర్రెడ్డి అంటే కేసీఆర్ ఆత్మ అని.. కేసీఆర్ మాటలనే కొత్త ప్రభాకర్రెడ్డి చెప్పారని ఆరోపించారు. ఎమ్మెల్యే చేసిన కామెంట్స్ పై అవసరమైతే విచారణకు ఆదేశిస్తామన్నారు మంత్రి పొంగులేటి.ఇదిలా ఉంటే రేవంత్ సర్కార్ పై అంతలా కోపం పెంచుకున్న ఆ బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఎవరా అని ఇటు ప్రభుత్వ పెద్దలు, అటు ప్రతిపక్షాలు సైతం ఆరా తీస్తున్నాయట. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేంత ధైర్యం చేసే బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో ఎవరున్నారంటూ తెగ ఎంక్వైరీ చేస్తున్నారట. వారెవరనేది రాబోయే రోజుల్లో బయటపడుతుందో లేదో చూడాలి.

## ఇక్రిశాట్లో చిక్కిన చిరుత



**సంగారెడ్డి** పటాన్ చేరు లోని ఇక్రిశాట్ లో చిరుత చిక్కింది. చిరుత సంచారంతో ఇక్రిశాట్ కార్మికులు రెండు రోజులుగా భయంతో వుండిపోయారు. ఆటవీ శాఖ అధికారులు బోన్ లు, సీసీ కెమెరాలు బిగించారు. చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్ ల వద్ద రెండు మేకలను ఏర్పాటు చేసారు. వాటిని వేటాడానికి వచ్చిన చిరుత బోనులో చిక్కింది. చిరుతను జూ పార్క్ కు తరలించారు.

# సెహభాష్... పోలీస్...

**హైదరాబాద్ :** దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్ గా నిలిచారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. ముఖ్యంగా పోలీసులపై భారత రాష్ట్ర సమితి నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. పోలీసులు ప్రభుత్వానికి, ప్రజలకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారిపోయారని ఆరోపిస్తున్నారు.. అయితే భారత రాష్ట్ర సమితి నాయకులు చేస్తున్న ఆరోపణలకు సరైన కౌంటర్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులకు.. ఇప్పుడు బలమైన ఆయుధం లభించింది. ఎందుకంటే దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్ గా నిలిచారు.. ఇండియా జస్టిస్ రిపోర్ట్ –2025 నివేదిక ఈ వివరాలను వెల్లడించింది.. ఆ నివేదిక ప్రకారం తెలంగాణ పోలీసులు న్యాయ వ్యవస్థలో రెండవ స్థానం, న్యాయ సంబంధిత సేవలలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచారు. న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణను కలిపి చూస్తే జాతీయ స్థాయిలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. కెపాసిటీ, పోలీసింగ్ వంటి అంశాలలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక 2, 3 స్థానంలో నిలిచాయి. మొత్తంగా చూసుకుంటే న్యాయవ్యవస్థలు, పోలీసు వంటి విభాగాలలో దక్షిణాది రాష్ట్రాలు మిగతా ప్రాంతాల కంటే మెరుగ్గా ఉన్నాయి.. ఈ జాబితాలో కర్ణాటక ఫస్ట్ ప్లేస్ లో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలున్నాయి. న్యాయ సహాయం, పోలీసు, న్యాయ వ్యవస్థ, జైళ్ల నిర్వహణ ఈ నాలుగు అంశాల ఆధారంగా దేశంలోనే పెద్ద, మధ్యస్థాయిలో రాష్ట్రాలను అధ్యయనం చేశారు. అనే ఆధారంగా నివేదిక రూపొందించారు. పది పాయింట్లు మార్కులుగా కేటాయించగా కేటాయించగా 6.78 స్కోర్ తో కర్ణాటక తొలి స్థానంలో గెలిచింది. 3.63 స్కోర్ తో పశ్చిమ బెంగాల్ చివరి స్థానంలో ఉంది పశ్చిమ బెంగాల్ కంటే జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ కాస్త ముందు స్థానంలో ఉన్నాయి. అయితే గత ఏడాది తెలంగాణ 11వ స్థానంలో ఉండగా.. ఈసారి మూడో స్థానానికి వచ్చింది. ఇక ఐదవ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్.. రెండవ స్థానానికి చేరుకుంది..మనదేశంలో ప్రతి లక్ష జనాభాకు సంఘటన 197.5 మంది పోలీసులు ఉండాలి. మనదేశంలో కేవలం 155 మంది మాత్రమే ఉన్నారు. బీహార్ రాష్ట్రంలో లక్ష జనాభా కు 81 పోలీసులు మాత్రమే ఉన్నారు. దీంతో ఈ రాష్ట్రం చివరి స్థానంలో ఉంది. అయితే గతంతో పోల్చి చూస్తే బీహార్ రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది.. కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు గత మూడేళ్ల వ్యవధిలో న్యాయవ్యవస్థపరంగా ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలు జైళ్ల నిర్వహణలో ముందు వరుసలో ఉన్నాయి. ఇక జైళ్లకు వస్తున్న ఖైదీల సంఖ్య గతంతో పోల్చి చూస్తే 50% పెరిగింది. అయితే వీరిలో అదే విధంగా అండర్ ట్రయల్స్ కావడం విశేషం.. తెలంగాణ రాష్ట్రంలో పట్టణాలలో 51,974 మందికి, గ్రామాలలో 50,373 మందికి ఒక పోలీస్ స్టేషన్ ఉంది. పోలీస్ సిబ్బందిలో 8.7%, జైలు సిబ్బందిలో 6.6 శాతం మంది మహిళలు ఉన్నారు. కింది కోర్టులలో మహిళ న్యాయమూర్తులు 55.3%, హైకోర్టులలో 33.3 శాతమంది ఉన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో 20 ఏళ్లకు పైగా పెండింగ్లో ఉన్న కేసులు 17.7%, పది నుంచి 20 సంవత్సరాల మధ్య ఉన్న కేసులు 32.6 శాతం ఉన్నాయి.

## సిటీ శివార్లలో ఆక్రమణలు..

# అమ్మకాలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర శివారుల్లోని జవహర్నగర్ ప్రాంతంలో భూ ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది. విలువైన ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు కబ్జా చేసి.. పేద ప్రజలను మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అధికారులు రంగంలోకి దిగి.. జరిగిన ఆక్రమణలను తొలగించారు. కేవలం కంచెలు వేయడమే కాకుండా.. ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారనే అనుమానంతో వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు.ఈ అక్రమార్కుల వలలో అమాయక పేదలు, మధ్యతరగతి ప్రజలు చిక్కుకుంటున్నారు. తక్కువ ధరకే 80, 100 గజాల స్థలాలు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో స్థలానికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మొదట భూమిని చదును చేసి, తాత్కాలికంగా షెడ్లు వేసి వాటికి తప్పుడు ఇంటి నంబర్లు రాస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి నిజమైన ఇంటి నంబర్ వచ్చిందని నమ్మబలుకుతూ.. నోటరీ ద్వారా అమ్మకాలు జరుపుతున్నారు. అధికారులు కూల్చివేతలు చేపట్టిన సమయంలో.. అప్పటికప్పుడు కోర్టు నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. ఇలా దాదాపు 300 ఎకరాల్లో పక్కా ఇళ్లు వెలిశాయి. మరో 500–600 ఎకరాల్లో ఇదే తరహా కేసులు కోర్టులో నడుస్తున్నాయి.ఈ భూములను రక్షించడానికి హెచ్ఎండీఏ అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టు కేసులు లేని 12, 107 సర్వే నంబర్లలోని 750 ఎకరాలకు ఇనుప కంచె వేయడానికి దాదాపు రూ.7 కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. అక్రమార్కులు ఏదో ఒక లొసుగును పట్టుకుని మళ్లీ చొరబడుతూనే ఉన్నారు.భూముల స్వరూపం ఇలా.. మొత్తం 2370 ఎకరాలు ఉండగా.. వివిధ సంస్థలకు కేటాయించినది 600 ఎకరాలు. ఆక్రమించి ఇళ్లు నిర్మించిన భూమి 300 ఎకరాలు ఉండగా.. కోర్టు కేసులు ఉన్న భూమి 720 ఎకరాలు. ప్రస్తుతం 750 ఎకరాల్లో ఇనుప కంచె నిర్మించారు.ఇక్కడ బాధాకరమైన విషయం ఏమిటంటే.. సొంత ఇల్లు అనేది ఎంతో మంది పేద, మధ్యతరగతి ప్రజల కల. తమ జీవితకాలపు సంపాదనను కూడబెట్టుకుని, ఎంతో ఆశతో ఈ చౌక స్థలాల వైపు చూస్తున్నారు. కానీ.. అక్రమార్కుల మాయమాటలు నమ్మి మోసపోతున్నారు. అధికారులు కూల్చివేతలు చేపట్టినప్పుడు వారి ఆశలు ఒక్కసారిగా ఆవిరైపోతున్నాయి. తమ కష్టార్జితం కళ్ల ముందే మట్టిపాలవుతుంటే ఆ కుటుంబాల రోదన వర్ణనాతీతంగా మారుతున్నాయి.హెచ్ఎండీఏ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కేవలం ఆక్రమణలు తొలగించడమే కాకుండా.. ఈ అక్రమ దందా వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. అలాగే.. పేద ప్రజలకు చట్టపరమైన విషయాలపై అవగాహన కల్పించాలి. తక్కువ ధరకే వస్తున్న స్థలాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించాలి. అప్పుడే అమాయక ప్రజలు మోసపోకుండా ఉంటారు. ప్రభుత్వ భూములు కూడా రక్షించబడతాయి.

# నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

**( పెండ్యాల రామ్ కుమార్, మంథని )**




అంతర్జాతీయ చారిత్రిక కట్టడాల దినోత్సవాన్ని (ప్రపంచ వారసత్వ దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితిలోని సభ్యదేశాలు వారసత్వ సంపద పరిరక్షణకోసం ఒకరికొకరు వివిధ అంశాలలో పరస్పరం సహకరించుకోవాలన్న ప్రధానలక్ష్యంతో ఈ ప్రపంచ వారసత్వ దినోత్సవం ఏర్పాటుచేయబడింది. ప్రపంచ దేశాలలోని వారసత్వ సంపద పరిరక్షణ అనే అంశంపై 'ఐక్యరాజ్య సమితి' (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్), 'అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం' సంయుక్త ఆధ్వర్యంలో ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారసత్వ సంపద పరిరక్షణకు చేయవలసిన పనులు, నిర్వహించవలసిన కార్యక్రమాల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అలా సదస్సు ప్రారంభమైన ఏప్రిల్ 18వ తేదీని 'ప్రపంచ వారసత్వ దినోత్సవం'గా ప్రకటించాలని యునెస్కోకి ప్రతిపాదనలు పంపగా,. 1983లో ఆమోదించి ఏప్రిల్ 18వ తేదిని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచ వారసత్వ దినోత్సవం రోజున అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యతను తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 800 ప్రపంచ స్థాయి పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షిస్తున్నారు. భారతదేశం నుండి ఇప్పటివరకు 40 ప్రదేశాలు యూనెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో భారత్ నుండి స్థానం సంపాదించాయి. **సాంస్కృతిక ప్రదేశాలు మొత్తం 24 అందులో** 1.ఆగ్రా కోట (1983) 2.అజంతా గుహలు (1983) 3.ఎల్లోరా గుహలు (1983) 4.తాజ్ మహల్ (1983) 5.కోణార్క సూర్య దేవాలయం (1984) 6.మహాబలిపురం వద్ద గల కట్టడాల సముదాయం (1984) 7.గోవా చర్చులు, కాన్వెంట్లు (1986) 8.ఫతేపూర్ సిక్రీ (1986) 9.హంపి వద్ద గల కట్టడాల సముదాయం (1986) 10.ఖజురహో కట్టడాలు (1986) 11.ఎలిఫెంటా గుహలు గుహలు (1987) 13.గ్రేట్ లివింగ్ చోళా టెంపుల్స్ (1987) 13.పట్టడకళ్ కట్టడాల సముదాయం (1987) 14.సాంచిలోని బౌద్ధ కట్టడాలు (1989) 15.హుమాయూన్ సమాధి (1993) 16.కుతుబ్ మినార్ కట్టడాలు (1993) 17.భారతీయ పర్వత రైల్వేలు (1999) 18.బోధ గయాలోని మహాబోధి ఆలయ సముదాయం (2002) 19.భీమ్‌బేట్కా శిలా గుహలు (2003) 20.చంపానేర్ పవాగాద్ ఆర్కియాలజికల్ పార్క్ (2004) 21.ఛత్రపతి శివాజీ టెర్మినస్ (గతంలో విక్టోరియా టెర్మినస్) (2004) 22.ఎఱ్ఱకోట (2007) 23.జైపూర్ జంతర్ మంతర్ (2010) 24.రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్ (2013) 25.రాణి కీ వావ్ (2014) 26.గ్రేట్ హిమాలయాన్ జాతీయ ఉద్యానవనం (2014) 27.బీహార్ లోని నలంద వద్ద ఉన్న నలంద మహావిహార పురావస్తు ప్రదేశం (2016) 28.ది ఆర్కిటెక్చరల్ వర్క్ ఆఫ్ లే కార్బ్యూసియర్ (2016) 29.చారిత్రాత్మక నగరం అహ్మదాబాద్ (2017) 30.విక్టోరియన్ అండ్ ఆర్ట్ డెకో ఎన్సెంబుల్ (ముంబై) (2018) 31.జైపూర్ (2019) 32.రామప్ప దేవాలయం (2021) 33.ధోలావీరా (2021) ఉండగా సహజసిద్ధమైన ప్రదేశాలు (6) 1.కాజీరంగా జాతీయవనం (1985) 2.కియోలాడియో జాతీయ ఉద్యానవనం (1985) 3.మానస్ జాతీయ అభయారణ్యం (1985) 4.సుందర్‌బన్స్ జాతీయ ఉద్యానవనం (1987) 5.నందాదేవి, వాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్ (1988) 6.పశ్చిమ కనుమలు (2012) 7.కాంచన్‌జంగ్ జాతీయ ఉద్యానవనం (2016)లు ఉన్నాయి.

# ప్రతిపక్షాలకు లోకేష్..మోడల్

**విజయవాడ :** రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయి. గెలుపోటములు కూడా ఉంటాయి. ఇవన్నీ పార్టీలకు వర్తిస్తాయి. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో అందరికీ తెలిసిందే. 2014 వరకు ఆ పార్టీ హవా నడిచింది. అటు తరువాత బిజెపి శకం ప్రారంభం అయింది. వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ. అయితే ఇప్పటికీ బీజేపీ హవా నడుస్తూనే ఉంది. అయితే ఇది ఎల్లకాలం ఉంటుందని చెప్పలేం. మొన్నటి వరకు తెలంగాణలో అధికారంలో ఉంది బిఆర్ఎస్. కానీ సార్వత్రిక ఎన్నికల్లో బోణీ కొట్టలేకపోయింది. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని బలంతో ఉండేది. కానీ మొన్నటి ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అంతెందుకు మొన్నటి వరకు ఫెయిల్యూర్ నాయకుడిగా ఉన్నారు నారా లోకేష్. అటువంటి నేత ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో యువ నేతలకు ఇన్స్పైర్ చేసే విధంగా మారారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. ఇబ్బందులను అధిగమించి నిలబడగలిగారు.ఒకప్పుడు లోకేష్ ఒక నాయకుడేనా అనే పరిస్థితి ఉండేది. ఆయన సమర్థతపై అందరిలోనూ అపనమ్మకం ఉండేది. సొంత పార్టీ నేతలే అనుమానించేలా ఉండేది. రాజకీయ ప్రత్యర్థులు అయితే అవమానాలతో రెచ్చిపోయేవారు. కానీ ఇప్పుడు ఆయన పరిస్థితి మారింది. తాను ఒక నాయకుడిగా నిరూపించుకున్నారు. పాలకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ పార్టీ భావి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ కు మైనస్ లు కంటే ప్లస్ లే ఎక్కువగా ఉంటున్నాయి.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు నారా లోకేష్ ను ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ. అందుకే ఇప్పుడు ఆ పార్టీని బలోపేతం చేయడానికి కుటుంబ సభ్యులంతా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో కవిత ఇటీవల సంచలన ప్రకటనలు చేస్తున్నారు. పింక్ బుక్ రాసుకుంటున్నానని.. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తేల్చుతానని హెచ్చరిస్తున్నారు. తాను తన తండ్రి కెసిఆర్ మాదిరిగా మంచి దానిని కాదని.. తాను ఒక రౌడీ అని చెబుతున్నారు. అచ్చం 2024 ఎన్నికల కు ముందు నారా లోకేష్ చెప్పిన మాదిరిగానే కవిత కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా కవిత చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. లోకేష్ కు కాపీ కొడుతున్నారు అని కామెంట్స్ వినిపిస్తున్నాయి.2019లో అధికారంలోకి వచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అంతులేని విజయంతో ఆ పార్టీ టిడిపి అంతు చూడాలని భావించింది. కేసులతో భయపెట్టింది. అరెస్టులతో ఉక్కు పాదం మోపింది. ఆ సమయంలోనే నారా లోకేష్ పాదయాత్ర చేశారు. రెడ్ బుక్ అంటూ కొత్త ప్రకటన చేశారు. అన్ని ఆ బుక్ లో రాసుకుంటున్నానని.. తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని చెప్పారు. చెప్పిన మాదిరిగానే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను టార్గెట్ చేస్తున్నారు. తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. గతంలో టిడిపి విషయంలో తప్పులు చేసిన ఏ వైసీపీ నేతను విడిచి పెట్టడం లేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండే వారికి లోకేష్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే కవిత తీవ్రస్థాయిలో లోకేష్ మాదిరిగా హెచ్చరికలు పంపారు. తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ అవుతోంది.

# నడ్డా వారసుడి కోసం కసరత్తు

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ముందు కీలక రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాల్సి ఉంది ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలకు అధ్యక్షులు ప్రకటించినప్పటికీ సగానికి పైగా రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయితే తప్ప జాతీయ అధ్యక్షుడి ఎన్నిక సాధ్యం కాదు. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ సమర్థత, ఆర్ఎస్ఎస్ అండదండలు ఉండే నేతకు జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నాయి. నూతన అధ్యక్షుడి ఎంపిక పార్టీ సంస్థాగత నిర్మాణానికి కొత్త దిశను ఇవ్వడంతోపాటు రాబోయే శాసనసభ ఎన్నికల వ్యూహంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దక్షిణాదిలో ప్రధానంగా తెలంగాణ, కర్ణాటకలో సొంతంగా పాగా వేయాలని చూస్తున్న అధిష్ఠానం ఆచితూచి అధ్యక్ష ఎంపికపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన సలహాలు సూచనలు ,రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాల ఆధారంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తిచేయనుంది.నూతన జాతీయ అధ్యక్షుడు ఎన్నిక తర్వాత పార్టీలో సంస్థాగత మార్పులు, ఎన్నికల వ్యూహాలపై పెద్ద ప్రభావం చూపవచ్చు. అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరగాల్సి ఉండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఏప్రిల్ సగం గడిచినప్పటికీ ఇంకా ఎన్నిక జరగలేదు. అధ్యక్షుడి ఎంపికలో సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే నాయకుడికి ప్రాధాన్యత ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నూతన అధ్యక్షుడు వచ్చిన తర్వాత 50 శాతం జాతీయ ప్రధాన కార్యదర్శులను తొలగించే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు, కొత్త అధ్యక్షుడి బృందంలో యువ నాయకులకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇవ్వవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం నుంచి కొంతమంది నాయకులను పార్టీ సంస్థాగత వ్యవహారాల్లోకి తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రస్తుతం పలువురు నాయకుల పేర్లు రేసులో ఉన్నాయి. ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్ కుమార్, రఘునందన్ రావు, రామచంద్రరావు, డీకే అరుణ, మురళీధర్ రావు, పాయల శంకర్, చింతల రామచంద్రా రెడ్డి సహా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జి.కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉండగా కేంద్ర మంత్రిగా బిజీగా ఉండటం వల్ల రాష్ట్రంలో పార్టీని నడిపించేందుకు కొత్త నాయకుడి అవసరం ఉందని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ఇప్పటికే అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అధిష్ఠానం పరిశీలకులతో అభిప్రాయాలని సేకరించింది. నాయకుల మధ్య అంతర్గత పోటీ, ఫిర్యాదుల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అధిష్టానం ఒకరిని అధ్యక్షుడిగా నిర్ణయించి మెజారిటీ జిల్లా అధ్యక్షులు చేత నామినేట్ చేయించి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసి అధికారికంగా అధ్యక్షుడు ప్రకటన పూర్తి చేస్తుంది. అధ్యక్ష పదవి ఎంపిక తెలంగాణలో బీజేపీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం. అధిష్ఠానం ఈ విషయంలో రెండు మూడు రోజుల్లో స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.బీసీ సామాజికవర్గం.. తెలంగాణాలో పాపులారిటీ.. సహా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టాలంటే ఈటలరకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రేసులో ఉన్న నేతలు సైతం ఈటల రాజేందర్‌కు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే తమకు అభ్యంతరం లేదని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇప్పటికే అనేక సందర్భాల్లో పక్క పార్టీల నుంచి వచ్చిన వారిని అధ్యక్షులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల తమిననాడు అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. పక్కన ఉన్న ఏపీలో పురంధేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణలను అధ్యక్ష పీఠం ఎక్కించిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సైతం ఎవరిని అధ్యక్షుడు చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం.ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలో మంత్రివర్గంలో స్థానం రాకపోవడంతో ప్రస్తుతం ఉన్న పురంధేశ్వరిని మరోసారి కొనసాగించే అవకాశం ఉంది. పురంధేశ్వరి స్థానంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యేలు పార్థ సారధి, సుజనా చౌదరి ముందు వరుసలో ఉన్నారు. సామాజిక సమీకరణాలు పార్టీ బలోపేతం లక్ష్యంగా ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఉండబోతున్నట్లు తెలుస్తోంది

## పాదయాత్రకు రెడీ అవుతున్న కవిత

**హైదరాబాద్ :** రాజకీయాల్లో ఓ సక్సెస్ ఫార్ములా ఉంటుంది. ఓ ఫార్మాట్ ఉంటుంది. ఆ ఫార్ములా, ఫార్మాట్‌లలో ఎవరైనా ప్రయత్నిస్తే.. విజయం సాధిస్తే.. అదే దారిని మరికొందరు ఎంచుకుంటారు. ఏపీలో నారా లోకేష్ అనుసరించిన ఫార్ములా, ఫార్మాట్‌ను ఇప్పుడు తెలంగాణలో కవిత ఎంచుకుంటున్నారు. ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ రెడ్ బుక్ అని ఓ పుస్తకం పట్టుకుని ప్రచారం చేశారు. అందులో చట్టాన్ని ఉల్లంఘించిన వారి పేర్లు రాశానని అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటానని చెప్పేవారు. చర్యలు తీసుకోరేమో అన్న డౌట్ వద్దని చంద్రబాబు మంచి వారే కానీ తాను మాత్రం మూర్ఖుడినని చెప్పేవారు. ఈ మాటలు క్యాడర్ మనసుల్లోకి వెళ్లిపోయాయి. ఆయన ఇమేజ్ పెరిగింది. విజయం కూడా లభించింది. ఇప్పుడు తెలంగాణలో కల్వకుంట్ల కవిత కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇలాంటి రాజకీయమే చేస్తున్నారు. కవిత తమ పార్టీ రంగు అయిన పింక్ బుక్ పేరుతో రాజకీయం చేస్తున్నారు. అలాగే కేసీఆర్ మంచోడే కానీ.. తాను కాస్త రౌడీ టైప్ అని స్వయంగా చెప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాలు ఎన్నికల మూడ్ లోకి వెళ్లిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి. కవిత తమ పార్టీ నేతలకు భరోసా ఇవ్వడానికి, ధైర్యం చెప్పడానికి? కాంగ్రెస్ నేతలను బెదిరించడానికి లోకేష్ చూపిన మార్గాన్ని ఎంచుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కవిత ప్రకటన వైరల్ గా మారింది. బీఆర్ఎస్ సభకు వెళ్తే ఊరుకునేది లేదని హెచ్చరికలు వస్తున్నాయని పార్టీ నేతలు ఆమెకు చెప్పడంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. గతంలో లోకేష్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారని కొంత మంది గుర్తు చేసుకుంటున్నారు. లోకేష్ తరహా రాజకీయం చేస్తున్న కవిత.. పాదయాత్ర ఆలోచన కూడా చేస్తే బాగుంటుందని బీఆర్ఎస్ నేతసలు అనుకుంటున్నారు. అయితే ఇప్పటికే కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. వచ్చే ఏడాది ఆయన పాదయాత్ర ఉంటుంది. అందుకే కవిత ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరకూ అంటే తనకు బాధ్యత ఇచ్చిన జిల్లా వరకూ పాదయాత్ర చేసే ఆలోచన చేయవచ్చని అంచనా వేస్తున్నారు. లోకేష్ ఫార్ములా మొత్తానికి అందర్నీ ఆకట్టుకుంటోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ నేతలకు హెచ్చరించారు. తాము పింక్ బుక్ లో అన్ని పేర్లు నమోదు చేసుకుంటున్నామని, అధికారుల నుంచి రాజకీయ నేతల పేర్ల వరకూ నమోదు చేసుకుంటున్నామని తెలిపారు.

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పార్టీ కార్యకర్తలను, నేతలను వేధించిన వారిని వదిలపెట్టే ప్రసక్తి లేదని కవిత హెచ్చరించారు. రజతోత్సవ సభకు... వరంగల్ లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసిందని, ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటామని తెలిపారు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదన్న కవిత బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదని ఎంఎల్సీ కవిత వ్యాఖ్యానించారు

# బంగారం... లకారం

బంగారం ధరలు కొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బుధవారం పది గ్రాముల పసిడి ధర రూ.98,000 మార్క్‌ను దాటింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,650 పెరిగి రూ.98,100 కి చేరుకుంది. మొత్తానికి పసిడి ధర లక్షకు చేరువ అవుతోంది. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య యు ద్ధం పెరుగుతుండడంతో ప్రపంచ వ్యాప్తం గా బంగారం సురక్షితమై పెట్టుబడిగా భావించి ఇన్వెస్ట్ చేస్తున్నారు. పెరుగుతున్న బంగారం ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో గోల్డ్ రేటు సరికొత్త రికార్డులను నమోదు చేస్తుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. బంగారం ధర ఇదే రీతిలో పెరుగుతూ పోతే రాబోయే ఐదారు నెలల్లో రూ.లక్షన్నరకు చేరడం ఖాయమని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.బంగారం ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలు, అమెరికా, చైనా మధ్య అంతకంతకూ పెరుగుతున్న టారిఫ్ యుద్ధం కారణంగా గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయి. అధిక సుంకాలు, వస్తువులు, ఖనిజాల ఎగమతులపై ఆంక్షల ఫలితంగా అమెరికాలో టెక్ కంపెనీల షేర్లు, ప్రధాన సూచీలు నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా డాలర్ సూచీ 100 కంటే దిగువకు చేరడంతో సురక్షితమని భావించి బంగారం, వెండిపైకి పెట్టుబడులు తరలి వస్తున్నాయి. మరోవైపు అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గిస్తారనే అంచనాలూ బంగారం ధర పెరిగేందుకు దోహదం పడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం, నాడు 99.9 శాతం స్వచ్ఛత 10 గ్రా ముల బంగారం ధర రూ.96,450 కి చేరుకుంది. అయితే ఈ నెల 11న ఒక్క రోజే పసిడి ధర దాదాపు రూ.6,250 పెరిగింది. బుధవారం పది గ్రాముల పసిడి ధర మరుసటి రోజు రూ.1,650 పెరిగి రూ. 97,650కి చేరుకుంది. ఎంసిఎక్స్ మార్కెట్ల లో జూన్ డెలివరీకి గోల్డ్ ఫ్యూచర్ రూ. 1,984 (2.12 శాతం) పెరిగి రూ. 95,435కి చేరుకుంది. ఎల్‌కెపి సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విపి అనలిస్ట్ జతీన్ త్రివేది మాట్లాడుతూ, మరోసారి బం గారం ధర గణనీయమైన వృద్ధిని సాధించిం ది.సురక్షితమైన పెట్టుబడిగా భావించడంతో కామెక్స్ గోల్డ్ 3,300 డాలర్లను దాటిందని అన్నారు. మరోవైపు కిలో వెండి ధర రూ.1900 పెరిగి రూ.99,400 కి చేరుకుంది. మంగళవారం నాడు కిలో వెం డి ధర రూ.97,500 గా ఉంది. జనవరి 1 నుంచి చూస్తే బంగారం దాదాపు రూ. 18,710 (23.56 శాతం) పెరిగింది. జనవరిలో ఈ బంగారం పది గ్రాముల ధర రూ.79,390 గా ఉంది. అదే సమయంలో వెండి ధర కూడా రూ.10,558 పెరిగి కిలో కు రూ.86,017 నుంచి రూ.99,000కి చేరుకుంది. ఈ సంవత్సరం చివరి నాటికి బంగారం ధర రూ.1.10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అ మెరికా, చైనా మధ్య పెరుగుతున్న వాణి జ్య యుద్ధం, మాంద్యం భయాల కారణంగా ఈ సంవత్సరం బంగారం ఔన్సుకు 3,700 డాలర్లకు చేరుకోవచ్చు. విదేశీ పెట్టుబడి బ్యాంకు గోల్డ్‌న్ శాచ్స్ ఈ అంచనాను విడుదల చేసింది. అంతర్జాతీయ ధరల ప్రకారం లెక్కిస్తే, భారతదేశంలో 10 గ్రా. బంగారం ధర రూ.1.10 లక్షల వరకు పెరగవచ్చు.పెట్టుబడిదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్, ద్రవ్యోల్బణ ఆందోళనలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ మాంద్యం వచ్చే ప్రమాదం పెరగడం వంటి కారణాల వల్ల ఇప్పటికే బంగారం కొత్త రికార్డు స్థాయికి చేరుకుంది. ఇటీవలి ధరల హెచ్చుతగ్గులు, స్థూల ఆర్థిక సంకేతాలు బంగారం ధర బుల్లిష్ ట్రెండ్‌కు దారితీస్తున్నాయని గోల్డ్‌మన్ సాచ్స్, యూబిఎస్ తెలిపాయి. సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు పెరగడం, సంస్థాగత, రిటైల్ పెట్టుబడిదారుల నుంచి డిమాండ్ పెరగడం, పరిమిత సరఫరా సౌలభ్యం బంగారం ధరల పెరుగదలకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.అమెరికా వాణిజ్య సుంకాల చర్యల కారణంగా ఈ నెల ప్రారంభంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టి.. ఆ తర్వాత భారీగా పెరిగాయి. భారతీయ మార్కెట్లో బంగారం ధర లక్ష మార్క్ చేరువగా వచ్చింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఔన్స్ 4,500 డాలర్లు ధర ఉండవచ్చునని గోల్డ్‌మన్ సాచ్స్ చెబుతోంది. ఇదే జరిగితే దేశీయంగా తులం బంగారం ధర రూ.1.25 లక్షలకు చేరడం ఖాయమని అంచనా వేసింది.యూబీఎస్ కూడా బంగారం ధరలపై అంచనాలను వెల్లడించింది. ఈ ఏడాదిలో బంగారం ధరలు ఔన్సుకు 3,500 డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. పెరుగుతున్న సుంకాల అనిశ్చితి, బలహీనమైన ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ నష్టాలు కారణాలుగా తెలిపింది. మార్కెట్లో విస్తృత స్థాయిలో బంగారానికి భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ధరల పెరుగుదలకు ఇంకా అవకాశం ఉందని యూబీఎస్ తెలిపింది. ట్రేడ్ వార్ మరింత ఉధృతమైతే.. బంగారం ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు మాత్రం అంచనా వేస్తున్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ సైతం బంగారం ధరలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతోంది. ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించడంతో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి.మదుపరులు సైతం పెట్టుబడుల కోసం పసిడి వైపు మొగ్గుచూపుతున్నారు. దాంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు అమాంతం పెరిగిపోయాయి. టారిఫ్‌ల నుంచి చైనా మినహా అన్ని దేశాలకు 90 రోజులపాటు రిలీఫ్ అందించడంతో ఈక్విటీ మార్కెట్లు సైతం నెమ్మదిగా తేరుకుంటున్నాయి.పసిడి ధరలపై 2025లో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనాలను మూడుసార్లు సవరించింది. తొలుత ఔన్స్

# తిరుపతిలో టీడీపీ, వైసీపీ నేతల సవాళ్లు ప్రతిసవాళ్లు

**తిరుపతి** తిరుపతిలో టీడీపీ, వైసీపీ నేతల సవాళ్లు ప్రతిసవాళ్లు ఉద్రిక్తతను రేపాయి. గురువారం ఉదయం టీడీపీ ఎమ్మెల్యేలు టీటీడీ గోశాలకు చేరుకున్నారు. గోశాలలో ఆవుల పరిస్థితి సమీక్షించడానికి అక్కడికి వచ్చారు. అయితే కూటమి నేతల శాంతి ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. మరోవైపు, గోశాలకు బయల్దేరిన టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్ఆరు. దాంతో భూమన, వైకాపా నేతలు రోడ్డుపై బైఠాయించారు. భూమన సహా వైసీపీ నేతల ఇళ్ల దగ్గర పోలీసులు మోహరించారు.



# మహిళలను రాణులుగా మారుస్తున్న ముద్ర..

**హైదరాబాద్ :** ఒక కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం ఎంతో ఉన్నత స్థాయికి చేరుతుంది అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ కుటుంబంతోపాటు సమాజం, దేశం కూడా ప్రగతి నడుస్తాయి. మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగితే మరింత ప్రయోజనాలు కలుగుతాయి. ఆమె ఉన్నత స్థాయికి చేరడంతో పాటు ఆ పారిశ్రామిక రంగంలో ఉన్న మిగిలిన చాలామందికి కూడా ఉపాధి కలుగుతుంది. పొదుపుకు ప్రాధాన్యత లభిస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటివరకు ఎన్నో చర్యలను చేపట్టింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రోత్సాహం అందిస్తుంది. అప్పటి రోజులలో మహిళలు ఎక్కువగా కూలి పనుల మీద ఆధారపడి బతికే వాళ్ళు. చిన్న పరిశ్రమల స్థాపన అనేది అప్పటి వారికి తెలియని అంశంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడి అని చెప్పొచ్చు. అప్పట్లో తినడానికే తిండి లేక ఇబ్బంది పడే కుటుంబాలు పెట్టుబడిని ఎక్కడ నుంచి వస్తాయి. ఇటువంటి పరిస్థితిని పీఎంఎంవై చాలా సుమూలంగా మార్చిందని చెప్పొచ్చు.ఈ పథకం కింద మహిళలు రుణాలు పొంది టైలరింగ్ యూనిట్లు, బ్యూటీ పార్లర్స్, ఫుడ్ స్టాల్స్, అగ్రిప్రాసెసింగ్ యూనిట్స్ అలాగే దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఇది వారి జీవితంలో ఆర్థిక పరిస్థితులతో పాటు సమాజంలో వాళ్లకు గొప్ప మార్పును కూడా మెరుగుపరిచిందని చెప్పడంలో సందేహం లేదు. మహిళలు ఆర్థికంగా మెరుగుపడినప్పుడు వాళ్ళ పిల్లల చదువు మరియు ఆరోగ్యం కూడా బాగుంటుంది. మహిళలు వాటికి ఖర్చు చేయగలిగితే వారి ఆర్థిక స్తోమత కూడా మెరుగుపడుతుంది. ఈ క్రమంలో రాబోయే భవిష్యత్తు తరాలు ఉన్నతంగా ఎదుగుతాయి. ఈ విధంగా పీఎం ఎం వై సూక్ష్మ వ్యవస్థాపకులను ప్రోత్సహించడంతోపాటు సాధికారత మరియు ఆర్థికంగా చురుకైన మహిళలను తయారు చేస్తుందని చెప్పొచ్చు. ప్రధానమంత్రి ముద్ర యోజన రుణాలు తీసుకున్న వాళ్లలో సుమారు 68% వరకు మహిళలే ఉన్నారు.ఈ పథకం కింద రుణం తీసుకున్న మహిళలకు సిఏజిఆర్ 2016 నుంచి 2025 ఆర్థిక సంవత్సరాల మధ్య 13 % గా ఉంటుంది. ఈ క్రమంలో మహిళల పొదుపులో 14% పెరిగాయి. ఈ పథకం కింద రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ఉపయోగించడం వలన జరిగిన ఆర్థిక ప్రగతిని కూడా ఇవి సూచిస్తున్నాయని తెలుస్తుంది.

# ‘ఓదెల 2’ రివ్యూ..

## – సీక్వెల్ ఎలా ఉందంటే!

- సినిమా పేరు: ఓదెల 2
- తారాగణం: తమన్నా, హెబ్బాపటేల్, వశిష్ట ఎన్.సింహా..
- దర్శకత్వం: అశోక్‌తేజ - దర్శకత్వ పర్యవేక్షణ: సంపత్ నంది
- నిర్మాత: డి.మధు






ఓటీటీ హిట్ ‘ఓదెల రైల్వే స్టేషన్’కు సీక్వెల్‌గా ‘ఓదెల 2’ వస్తుంది అనగానే ఈ సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొంది. శివశక్తిగా తమన్నా లుక్ విడుదల చేసినప్పట్నుంచీ సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. దర్శకుడు సంపత్‌నంది రచన అందించడంతోపాటు ఈ సినిమా నిర్మాణంలో కూడా భాగం అవ్వడం, ‘కాంతారా’ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నందించడం మరీ ముఖ్యంగా నిర్మాత మధు చేసిన ప్రమోషన్స్ సినిమాకు మంచి బజ్‌ని తీసుకొచ్చాయి. మరి అందరి అంచనాలనూ ‘ఓదెల 2’ అందుకుందా? తొలిపార్ట్ విజయాన్ని ఈ మలిపార్ట్ కూడా కొనసాగించిందా? అనే విషయాలు తెలియాలంటే ముందు కథలోకి వెళ్లాలి.

### కథ:

ఊళ్లో ఆడవాళ్ల ఉసురు పోసుకుంటున్నాడన్న విషయం తెలిసి, భర్త తిరుపతి(వశిష్ట ఎన్.సింహా)ని భార్య రాధ(హెబ్బాపటేల్) నరికి చంపి అతని తలతోపాటు పోలీస్టేషన్‌కి వెళ్లి లొంగిపోవడంతో ‘ఓదెల రైల్వేస్టేషన్’ కథ ముగిసింది. రాధ జైలుకు వెళ్లింది. తిరుపతి శవానికి పోస్ట్‌మార్టం పూర్తయింది. బాడీని ఇంట్లోవారికి అందజేశారు. తిరుపతి శవాన్ని ఊళ్లోకి తీసుకొచ్చారు. ఊళ్లోజనం ఉసురు పోసుకున్నాడన్న కసితో ఊళ్లోవారెవరూ తిరుపతి శవాన్ని చూడ్డానికి కూడా రాలేదు. సరికదా.. అతని ఆత్మని కూడా శిక్షించాలని నిర్ణయించుకుంటారు. ఊరి పూజారి సలహా మేరకు అతని శవాన్ని నిలువనా నిలబెట్టి, అతని శరీరాన్ని కోడి నెత్తురుతో తడిపి, ఊళ్లో జనం గోళ్లు మూటగట్టి.. ఆ మూటతో సహా అతన్ని పాతిపెడతారు. అలా నిలువునా పాతిపెడితే అతని ఆత్మకు శాంతి క్షోభకు గురి అవుతుందని వారి నమ్మకం. ఊరి జనం చేసిన పనివల్ల తిరుపతి ఆత్మ నిజంగానే క్షోభ చెందుతుంది. ఆ బాధ కాస్తా పగగా మారుతుంది. తను దెయ్యంగా మారతాడు. ఊర్లో కొత్తగా పెళ్లయిన జంటల్నీ టార్గెట్ చేసి, భయంకరంగా చంపతుంటాడు. వేరేవాళ్ల శరీరాల్లోకి ప్రవేశించి వారి ద్వారా తన కార్యాన్ని పూర్తి చేస్తుంటాడు. ఈ చర్యలవల్ల అమాయకులు బలైపోతుంటారు. అలాంటి సమయంలో తరుణోపాయం కోసం ఊరిజనం జైల్లో ఉన్న రాధను కలుస్తారు. ‘వాడ్ని చంపింది నువ్వే. ఇప్పుడు కాపాడాల్సింది నువ్వే’ అని ప్రాధేయపడటంతో రాధ తన అక్క భైరవి(తమన్నా) గురించి ఊరు జనాలకు చెబుతుంది. ఈ దెయ్యం ఆటకట్టించే శక్తి భైరవికి మాత్రమే ఉందని రాధ ఊరి జనాలకు చెప్పడంతో ఊరిజనం భైరవిని వెతికే ప్రయత్నాలు మొదలుపెడతారు. తన జీవితాన్ని శివుడికే అంకితం చేసిన నాగసాధు భైరవి. మరి భైరవిని ఊరుజనం ఎలా చేరారు? ఊరికి పట్టిన పీడను భైరవి ఎలా వదిలించింది? ఈ క్రమంలో క్షుద్రశక్తితో భైరవి చేసిన పోరాటం ఏంటి? అనేదే మిగతా కథ.

### విశ్లేషణ

సూపర్ నాచురల్ థ్రిల్లర్ సినిమాలంటే లాజిక్కులు వెతకనక్కర్లా. సినిమాను ఆసక్తికరంగా తీస్తే చాలు సినిమా హిట్. గతంలో చాలా సినిమాలు అందుకు ఉదాహరణ. ఈ సినిమా కథ విషయానికొస్తే.. ఇందులో కొత్తదనం ఏమాత్రం లేదు. రచయిత, దర్శకత్వపర్యవేక్షకుడైన సంపత్‌నంది చెప్పినట్టు ‘ఆత్మ వర్సెస్ పరమాత్మ’ అంతే ఈ సినిమా. ఈ పాయింట్‌తో తెలుగుతెరపై లెక్కకు మించిన కథలొచ్చాయి. విజయాలను కూడా అందుకున్నాయి. ఇలాంటి సినిమాల్లో ట్విక్లెమాక్స్ ఏంటో ఆడియన్స్‌కి తెలుసు. ఆ తెలిసిన విషయాన్ని కొత్తగా చూపిస్తే సినిమా గట్టెక్కినట్టే. ఈ విషయంలో దర్శకుడు అశోక్‌తేజా కొంతమేర సక్సెస్ అయ్యాడు. ఫస్ట్ షాట్ నుంచే కథపై ఆసక్తిని కలిగించాడు. ప్రథమార్థం అంతా ‘అరుంధతి’ సినిమాను గుర్తు చేస్తుంది. అందులో పశుపతిని అరుంధతి సమాధి చేసినట్టుగానే ఇందులో తిరుపతిని ఊరిజనం సమాధి చేస్తారు. అందులో పశుపతి ఉగ్రభూతంగా మారినట్టుగానే ఇందులోనూ తిరుపతి దెయ్యంగా మారతాడు. అందులో షయాజీ షిండే పాత్రను గుర్తు చేసేలా ఇందులో మురళీశర్మ పాత్ర కనిపించింది. భైరవి పాత్ర ఎంటరైనప్పట్నుంచీ కథ మరోమలుపు తీసుకుంది. అక్కడ్నుంచీ తిరుపతి ఆత్మ, భైరవి మధ్య జరిగే సంఘటనలు ఆడియన్స్‌కి గూజ్‌బంప్స్ తెప్పిస్తాయి. ఓ దశలో తిరుపతి ఆత్మను భైరవి ప్రతిఘటించలేని పరిస్థితి రావడం, తిరుపతి ఆత్మ విశృఖలత్వం.. ఇవన్నీ ఉత్కంఠకు గురిచేస్తాయి. అయితే.. పతాక సన్నివేశం మాత్రం అనుకున్న స్థాయిలో అనిపించలేదని చెప్పొచ్చు.

### నటీనటులు

ఇందులో దెయ్యంగా మారిన తిరుపతి పాత్రను వశిష్ట.ఎన్.సింహా నటించాడు. ‘అరుంధతి’లో పశుపతి స్థాయిలో ఆ పాత్రను సంపత్ నంది డిజైన్ చేశారు. ఆ స్థాయి పర్‌ఫార్మెన్స్‌ని మాత్రం వశిష్ట.ఎన్.సింహా ఇవ్వలేకపోయాడని చెప్పొచ్చు. అయితే.. తన స్థాయికి గొప్పగానే నటించాడు. నాగసాధు భైరవిగా తమన్నా చాలా బాగా నటించింది. ఆమె పాత్రను లేడీ అఖండ అనొచ్చు. ఓ విధంగా ‘అఖండ’లో బాలకృష్ణ పాత్రను ప్రేరణగా తీసుకొని ఆ పాత్రను డిజైన్ చేశారా అనిపిస్తుంది. కొన్ని సంభాషణలు కూడా ‘అఖండ’ను గుర్తుకు తెస్తాయి. తమన్నా కూడా చాలా కష్టపడి నటించింది. ఆమె ఆహార్యం కూడా బావుంది. హెబ్బా పటేల్ అభినయానికి ఆస్కారమున్న మంచి పాత్ర చేసింది. ఉన్నంతలో తను కూడా బాగా చేసింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రకు రక్తికట్టించారు.

## పవన్ చిత్రంలో శింబు పాట



తమిళ హీరో శింబుకి పాటలు పాడటంలో కూడా చక్కటి ప్రావీణ్యం ఉన్న విషయం తెలిసిందే. తమిళ, తెలుగు భాషల్లో ఆయన ఇప్పటికే తనదైన గాత్రంతో సంగీత ప్రియుల్ని ఆకట్టుకున్నారు. తాజాగా ఆయన పవన్‌కల్యాణ్ ‘ఓజీ’ (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) చిత్రంలో ఓ పాటను ఆలపించారు. ఈ విషయాన్ని చిత్ర సంగీత దర్శకుడు తమన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ‘ఓజీ’ చిత్రంలో శింబు పాట పాడనున్నారని గతంలోనే వార్తలొచ్చాయి. తాజాగా తమన్ ప్రకటనతో అది నిజమని రుజువైంది. ‘ఫైర్ స్ట్రామ్’ పేరుతో కంపోజ్ చేసిన ఈ పాటకు శింబు వాయిస్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ‘ఓజీ’ సినిమా షూటింగ్ పునఃప్రారంభమైన తర్వాత ఈ పాటను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్, ఇమ్రాన్ హాష్మీ, అర్జున్‌దాస్, ప్రకాష్‌రాజ్ తదితరులు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. ఇంకా కొంతభాగం చిత్రీకరణ మిగిలి వుంది. రాజకీయ కార్యకలాపాలకు కాస్త విరామం ప్రకటించి త్వరలో ఈ సినిమా షూట్‌లో పవన్‌కల్యాణ్ జాయిన్ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది.



## ఫాలోవర్స్ ఉంటే ఏం లాభం?

అగ్ర కథానాయిక పూజాహెగ్డే ప్రస్తుతం ‘రెట్రో’ చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా గురించి పూజాహెగ్డే ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది. తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో 3కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారని, అంతమాత్రాన వారందరూ టికెట్లు కొని సినిమాలు చూస్తారని గ్యారంటీ ఇవ్వలేం కదా అని వ్యాఖ్యానించింది. ‘సోషల్‌మీడియా చాలా భిన్నమైన ప్రపంచం. ఏది నిజమో నిర్ధారణ చేసుకోలేం. కొంతమంది తారలకు 50లక్షల మంది ఫాలోవర్స్ మాత్రమే ఉంటారు. కానీ బాక్సాఫీస్ వద్ద వాళ్ల సినిమాలకు మంచి వసూళ్లు లభిస్తాయి. అందుకే వృత్తిపట్ల అంకితభావంతో ఉంటూ బయటి వారి నుంచి సినిమా తాలూకు ఫీడ్‌బ్యాక్‌ను తీసుకోవాలి. అప్పుడే వాస్తవాలు తెలుస్తాయి’ అని పూజా హెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఆమె మాటలు వైరల్‌గా మారాయి. లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ‘రెట్రో’ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో సూర్య గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమా నిర్మాణంలో సూర్య భాగస్వామిగా ఉన్నారు.

## చౌర్య పాఠంలో ఏముంది?



ఇంద్రారామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం ‘చౌర్య పాఠం’. నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో నక్కిన త్రినాథ రావు నిర్మిస్తున్నారు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. క్రైమ్ ఎలిమెంట్స్, డార్క్ హ్యూమర్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత త్రినాథ రావు నక్కిన చిత్ర విశేషాలు తెలియజేస్తూ.. చౌర్య పాఠం అంటే దొంగతనం చేయడానికి నేర్చుకునే ట్రిక్కులు కాదని, ఒక అవసరం కోసం దొంగతనం చేయాల్సి వచ్చినప్పుడు, ఈ క్రమంలో నేర్చుకునే విషయాలని తెలిపారు. ఈ డార్క్‌హ్యూమర్ క్రైమ్ కామెడీ కథలో చక్కటి లవ్‌స్టోరీ ఉంటుందని, సాంకేతికంగా అన్ని అంశాల్లో ఉన్నతంగా కనిపిస్తుందని ఆయన చెప్పారు. ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్‌కు గురిచేసే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని దర్శకుడు నిఖిల్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: దావ్‌జాంద్, నిర్మాత: నక్కిన త్రినాథ రావు, రచన–దర్శకత్వం: నిఖిల్ గొల్లమారి.

## 2209లో జరిగే కథ



కన్నడ అగ్ర హీరో కిచ్చా సుదీప్ ‘2209’ పేరుతో ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. 2209లో జరిగే కథ ఇది. అనుప్ భండారి దర్శకుడు. ‘హనుమాన్’ చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించనున్నారు. బుధవారం ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టారు. భారతీయ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ కథల పరంపరలో ఇదొక వినూత్నమైన ప్రయోగమని, ఓ సాహస యాత్రను ఆవిష్కరిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా సాగుతుందని, ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనూప్ బండారి.

## ఇప్పటివరకూ రాని కాన్సెప్ట్



శివరాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా మూవీ ‘45’. అర్జున్ జన్యా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉమా రమేష్ రెడ్డి, ఎం.రమేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది. బుధవారం టీజర్‌ను లాంచ్ చేశారు. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌ప్లే రానటువంటి కాన్సెప్ట్ ఇదని, సనాతన ధర్మం గురించిన అంశాలు కూడా ఉంటాయని నిర్మాత తెలిపారు. నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాలో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, క్లాస్..మాస్ ప్రేక్షకుల్ని మెప్పించే అన్ని అంశాలుంటాయని ఉపేంద్ర చెప్పారు. దర్శకుడు తనకు ఈ కథను నాలుగు నుంచి ఐదు నిమిషాల పాటు చెప్పాడని, అందుకే 45 అని టైటిల్ పెట్టామని శివరాజ్ కుమార్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, సంగీతం, దర్శకత్వం: అర్జున్ జన్యా.

On behalf of Circulated and owned by Vutukuru Venkateswara Sarma, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Printed at Sri Sindhuja Printers, Screens & Graphiscs, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Editor : Vutukuru Venkateswara Sarma, Mob: 9491021199, RNI: APTEL/2012/48884, Email: editorsharpnews@gmail.com